వైఎస్ఆర్
# కడప-అన్నమయ్య వార్త
తెలుగు దాలీయ దినపత్రిక
మంగళవారం 10 ఫిబ్రవరి 2026

## ముఖ్యమంత్రి ఏపీఎస్ఆర్టీసీకి ప్రశంసలు

### మంత్రి మడిపల్లి హర్షం

రాయచోటి ఫిబ్రవరి 9 ప్రభాతవార్త

రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా శాఖపై ప్రశంసలు రాష్ట్ర రవాణా యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈరోజు అమరావతిలో జరిగిన మంత్రుల సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర రవాణా శాఖ పై ప్రశంసలు తెలియజేయడం తో రాష్ట్ర రవాణా యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తులో ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తామని మరియు స్త్రీ శక్తి పథకం బరువు కాదు బాధ్యతగా స్వీకరించి సేవలు అందిస్తామని మంత్రి మడిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఒక ప్రకటనలో తెలియజేశారు.

## ముందస్తు శివరాత్రి వేడుకలు

వేంపల్లె: ఫిబ్రవరి 09: ప్రభాతవార్త

స్థానిక ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం, ఓం శాంతి భవన లో ముందస్తు శివరాత్రి వేడుకలను చేపట్టారు. సోమవారం ఓం శాంతి నిర్వాహకులు విజయ, త్రివేణి, సౌమ్య ల ఆధ్వర్యంలో ఈ వేడుక నిర్వహించారు. దీంట్లో భాగం 90వ త్రిమూర్తి శివ జయంతిని చేశారు. పంచాయతీ ఇఓ నాగభూషణం రెడ్డి, ఓం శాంతి నిర్వాహకులు దీపాలను వెలిగించారు. అనంతరం శివరాత్రి విశిష్టతను తెలిపారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

# విద్యుత్ ఛార్జీల భారం పడనివ్వం... ప్రజలకే ట్రూ డౌన్ ఫలితాలు..

ఆర్టీసీలో 1,000 ఈవీ బస్సుల కొనుగోలు..

కీలక శాఖల్లో నిబంధనలు సరళతరంపై దృష్టి పెట్టండి..

పన్నుల వసూళ్లు తగ్గకూడదు... వ్యాపారులను వేధించకూడదు..

కేంద్రం నిధులను సమర్థవంతంగా వినియోగించుకోవాలి..

మంత్రులు, కార్యదర్శుల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు..

కడప ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :

ప్రజలపై విద్యుత్ ఛార్జీల భారం పడకుండా చూస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మరోసారి స్పష్టం చేశారు. ట్రూ డౌన్ ఫలితాలు ప్రజలకు అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. అలాగే విద్యుత్ కొనుగోలు భారాన్ని కూడా తగ్గించుకునేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. వ్యవసాయంలో ఏఐ సాంకేతికత, విద్యుత్, విత్తన నిర్వహణ, డ్రోన్లు, యాంత్రీకరణ తదితర అంశాలపై పలు సూచనలు చేశారు. సోమవారం రాష్ట్ర సచివాలయం ఐదో బ్లాకులో మంత్రులు, కార్యదర్శులతో ముఖ్యమంత్రి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల పనితీరు, ప్రభుత్వ పాలసీలు, పథకాల అమలుపై ముఖ్యమంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెటింగ్, మెరుగైన ధరలు లభించేందుకు ఉన్న అవకాశాలపై ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేస్తూ ఉండాలి. గ్లోబల్ మార్కెట్ ఉండే పంటలపై ఎక్కువ దృష్టి పెట్టాలి. రాయలసీమను ఉద్యాన రంగంలో అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వ నిధులతో పాటు ప్రైవేటు పెట్టుబడులపైనా దృష్టి పెట్టాలి. ప్రస్తుతం రాయలసీమ నుంచే 220 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి జరుగుతోంది. త్వరలోనే 400 మెట్రిక్ టన్నుల లక్ష్యాన్ని చేరుకుంటాం. ఇచ్చాపురం నుంచి నెల్లూరు వరకూ 4 లేన్ రైల్వే లైన్ వస్తోంది... స్పీడ్ ట్రైన్ ప్రాజెక్టు కూడా త్వరలోనే సాకారమవుతుంది. నెట్ జీరో ఎమిషన్ కాన్సెప్టుతో విద్యుత్ ఉత్పాదన జరగాలి. పీఎం కుసుమ్, సోలార్ రూఫ్ టాప్ ప్రాజెక్టులు వేగంగా చేపట్టాలి. రూ.3.90కే విద్యుత్ కొనుగోలు ధర తగ్గేలా చర్యలు తీసుకుంటున్నాం. ఆర్టీసీలో కనీసం వెయ్యి బస్సులను ఈవీగా మార్చాల్సిన అవసరం ఉంది. కుప్పంలో ఇటీవల ఓ 5 వేల పైచిలుకు ఇసైకిళ్లు పంపిణీ చేశాం. ఈ తరహా విధానాల వల్ల వేగంగా ట్రాన్సిషన్ జరుగుతుంది. గతంలో ఏపీలో నీరు, విద్యుత్ విషయంలో లోటు ఉండేది. ఇప్పుడు మిగులు పరిస్థితులు నెలకొంటున్నాయి. ఒక మీటరు వరకు భూగర్భ జలాలను పెంచటం ద్వారా దాదాపు రూ.4 వేల కోట్ల రూపాయలు ఆదా అవుతుంది." అని సీఎం చంద్రబాబు వెల్లడించారు.

### నిబంధనలు తగ్గాలి... పాలన సులభం కావాలి..

చిన్న రైస్ మిల్లు పెట్టడానికి 30కు పైగా అనుమతులు కావాల్సి వస్తోంది. ఇలాంటి పరిస్థితి పోవాలి. చిన్నపాటి వ్యాపారం ప్రారంభించడానికి 30 చోట్లకు తిరగడం కష్టసాధ్యమైన అంశం. మరోవైపు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ గురించి మాట్లాడుతున్నాం. వివిధ కీలక శాఖల్లో నిబంధనలను సరళతరం చేయాలి. అగ్నిమాపక, పురపాలక, అటవీ, స్కూల్ ఎడ్యుకేషన్ ఇలా వేర్వేరు శాఖల్లో నిబంధనలను మరింత సడలించాలి. నిర్దేశిత కాలపరిమితి ముగిసిన తర్వాత చట్టాలను సమీక్షించుకోవాల్సిన అవసరం ఉంది. సంస్కరణల్లో ముందుండాలి. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానానికి ఎలాంటి ఆటంకమూ రాకూడదు. నాణ్యమైన ఉత్పత్తులు వస్తేనే ఎక్కువ మార్కెట్ సాధ్యం అవుతుంది. స్వయం సహాయ సంఘాలకు కూడా స్వయం అనే పేరిట బ్రాండ్ రూపొందించాం. ఈ బ్రాండ్ ద్వారా వారు తయారు చేసిన ఉత్పత్తులకు అతిపెద్ద మార్కెట్ అందుబాటులోకి వస్తుంది. అరకు కాఫీ తరహాలోనే కోకో పంటకు కూడా మంచి బ్రాండింగ్ రావాలి. ఉత్పత్తుల నాణ్యతతో పాటు బ్రాండ్ ఇమేజ్ ఉండేలా చూడాల్సిన అవసరం ఉంది. నగర ప్రాంతాల్లో ఎస్టీపీల నిర్మాణం కోసం అవసరమైన మేరకు భూసేకరణ చేపట్టాలి దీనికి అవసరమైన నిధులను పీసీబీ సమకూరుస్తుంది. రూ.300 కోట్ల వ్యయంతో ఎస్టీపీల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలి. అటవీ శాఖ దగ్గర ఉన్న ఎర్ర చందనం విక్రయించి ఆదాయం ఆర్జించాల్సిన అవసరం ఉంది. సంస్కరణల ప్రాతిపదికన సాస్కీ కింద ప్రాజెక్టుల నిధులు త్వరితగతిన వచ్చేలా చూడాలి. వచ్చే ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ప్రాయోజిత పథకాల ద్వారా రాష్ట్రానికి రూ.26,021 కోట్లు వచ్చే అవకాశం ఉందని అంచనా వేశాం." అని ముఖ్యమంత్రి వెల్లడించారు. ఈ సమావేశంలో మంత్రులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు వర్చువల్‌గా సమావేశానికి హాజరయ్యారు.

## ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

### జిల్లా జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ

అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

మదనపల్లె, ఫిబ్రవరి 9ప్రభాతవార్త :

పిజిఆర్ఎస్‌లో ప్రజలు విన్నవించిన ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టడం జరుగుతుందని జిల్లా జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ తెలిపారు. సోమవారం మదనపల్లె జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన పిజిఆర్ఎస్‌లో ప్రజల నుండి వివిధ రకాల ప్రజాసమస్యలను అర్జీలను జిల్లా జాయింట్ కలెక్టర్ స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు విన్నవించిన సమస్యలను ఆయా శాఖల అధికారులు ద్వారా పరిష్కారానికి ఆదేశించడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం కూడా ఫిర్యాదుల పరిష్కారంపై నేరుగా పర్యవేక్షణ చేయడం జరుగుతుందన్నారు. ప్రతిసమస్యను, ప్రజల నుంచి వచ్చే పీడ్‌బ్యాక్‌ను ప్రభుత్వం సీరియస్‌గా పరిశీలిస్తుందని అధికారులందరూ బాధ్యతగా పిర్యాదులను నూరు శాతం పరిశీలించాలన్నారు. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న ధరఖాస్తులను కూడా పరిష్కరించాలన్నారు. సమస్యల పరిష్కారం కోసం అధికారుల వద్దకు ప్రజలు వస్తే సావదానంగా వినాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రజలను తిప్పుకోకుండా సమస్యను బట్టి ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. పిజిఆర్ఎస్‌లో జిల్లాలోని తంబళ్ళపల్లె, పీలేరు, మదనపల్లె, రాయచోటి, పుంగనూరు నియోజకవర్గాల్లోని వివిధ మండలాలకు చెందిన ప్రజలు 345 అర్జీలను జాయింట్ కలెక్టర్‌కు విన్నవించారు. కోళ్ళబైలు గ్రామం సర్వే నెంబర్ 672-1లో ప్రభుత్వ భూమి ఆక్రమణపై బివైఎస్ అధ్యక్షులు పునిత్ ఫిర్యాదు చేశాడు. ఈ స్థలంలో ఆక్రమ నిర్మాణ పనులు చేపట్టిన అధికారులు చర్యలు చేపట్టలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్‌రావు, సబ్‌కలెక్టర్ చల్లా కళ్యాణి, సర్వే ఏడి భరత్‌కుమార్, జిఎస్‌డబ్ల్యుఎస్ లక్ష్మీపతి, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రజా ఫిర్యాదుదారులకు చట్టపరిధిలో న్యాయం చేయండి

- అదనపు ఎస్పీ (పరిపాలన) కె.ప్రకాష్‌బాబు
- ప్రజా ఫర్యాదుల పరిష్కార వేదికకు 89 పిటీషన్లు

కడప క్రైం, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు వచ్చిన ఫిర్యాదుదారులకు చట్ట పరిధిలో న్యాయం చేయాలని అదనపు ఎస్పీ (పరిపాలన) కె.ప్రకాష్‌బాబు పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు ఏఎస్పీ ప్రకాష్‌బాబు పెన్నార్ పోలీసు కాన్ఫరెన్స్ హాలులో సోమవారం ప్రజా పిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమాన్ని నిర్వహించి ఫిర్యాదులను స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల వద్ద ఫిర్యాదుదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. వారి సమస్యలపై అక్కడికక్కడే సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ చేసి సదరు ఫిర్యాదులపై చట్టపరంగా చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేశారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులకు పోలీసు సిబ్బంది ప్రశాంతంగా తమ సమస్యలను వరించడానికి సహాయం చేశారు. జిల్లా పోలీసు కార్యాలయం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 89 పిటీషన్లు వచ్చాయి. ఈ కార్యక్రమంలో మహిళా డీఎస్పీ బాలస్వామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి

### కొట్టి చంపేసారంటు కుటుంబ సభ్యులు ఆరోపణ

మదనపల్లెక్రైమ్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త.

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన సోమవారం వెలుగు చూసింది. మృతుడి అక్క పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. మదనపల్లె మండలం, సిటిఎం కు చెందిన రామకృష్ణ, రమాదేవి దంపతుల కుమారుడు కిరణ్ కుమార్ (25) కు తల్లిదండ్రులిద్దరు లేకపోవడంతో అక్క గంగాదేవి, మరొక అక్క మూగమ్మ వద్ద ఉంటున్నాడు. ట్రాక్టర్ డ్రైవర్ పని చేస్తూ జీవనం చేసేవాడు. కాగా స్థానికంగా ఉంటున్న సురేష్ కుటుంబంలో ఒక ఆడపిల్లను ఏడిపించాడన్న అనుమానంతో కిరణ్ కుమార్ ను మూడు రోజుల క్రితం సురేష్, అతని స్నేహితులు డంబుల్స్ తో దాడి చేసిన తీవ్రంగా కొట్టారని అక్క గంగాదేవి ఆరోపించింది. దాడిలో గాయపడిన కిరణ్ కుమార్ గాయాలతో మంచం పట్టాడని తెలిపారు. గొంతు కింద చారలు ఉండడంతో తాను ప్రశ్నించగా తనను సురేష్ అతని స్నేహితులు టవల్ తో గొంతు బిగించి, చాలా దూరం ఈడ్చుకుపోయి చంపేందుకు ప్రయత్నించారంటూ చెప్పి రోదించాడని అక్క గంగాదేవి తెలిపింది. ఈ నేపథ్యంలో రాత్రి నిద్రలోనే కిరణ్ కుమార్ మృతి చెందాడు. కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించి మృతదేహాన్ని మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సురేష్ అతని స్నేహితులు తీవ్రంగా కొట్టడం వల్లే మా తమ్ముడు చనిపోయాడని గంగాదేవి ఆరోపిస్తోంది. ఈ మేరకు తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మదనపల్లెలో ఘోరం

### అట్టపెట్టెలో పెట్టి పసికందును కాలువలో వదిలేసిన వైనం

మదనపల్లెక్రైమ్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త.

కన్నప్రేమ కరువైందో.. లేక సామాజిక భయమో తెలియదు కానీ, అప్పుడే పుట్టిన పసిగుడ్డును కాలవలో పారేసిన అమానుష ఘటన మదనపల్లె మండలంలో చోటుచేసుకుంది. సభ్య సమాజం తలదించుకునేలా జరిగిన ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. మండలంలోని కోళ్లబైలు సమీపంలో ప్రవహిస్తున్న హంద్రీనీవా కాలువలో సోమవారం ఒక అట్టపెట్టె నీటిపై తేలుతూ రావడాన్ని గమనించిన స్థానికులు, కుతూహలంతో దానిని బయటకు తీశారు. తీరా ఆ పెట్టెను తెరిచి చూడగా, అందులో అప్పుడే పుట్టిన ఒక పసిబిడ్డ మృతదేహం కనిపించడంతో వారు ఒక్కసారిగా దిగ్భ్రాంతికి గురయ్యారు. లోకం చూడకముందే ఆ పసికందు ప్రాణాలు గాలిలో కలిసిపోవడం చూసి అక్కడి వారు కన్నీటి పర్యంతమయ్యారు. ఏ తల్లికి ఏ కష్టం వచ్చిందో కానీ, నవమాసాలు మోసి కన్న బిడ్డను ఇలా కాలువలో వదలడానికి మనసెలా ఒప్పింది..అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. కసాయి తల్లి చేసిన ఈ పనిపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ అభాగ్య పసికందుకు అనాథగా వదిలేయడం ఇష్టం లేక, మానవత్వంతో స్థానికులే దగ్గరుండి అంత్యక్రియలు నిర్వహించారు. ఈ బిడ్డ ఎక్కడి నుండి కొట్టుకువచ్చింది? ఆ తల్లిదండ్రులు ఎవరు? అనే కోణంలో చర్చ జరుగుతోంది.

## పదో తరగతి విద్యార్థులకు రెసిడెన్షియల్ ప్రత్యేక తరగతులు

మదనపల్లెక్రైమ్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త.

పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా కమిషనర్ ఆదేశాల మేరకు ప్రత్యేక కార్యాచరణను చేపట్టినట్లు డిఇఓ సుబ్రమణ్యం తెలిపారు. సోమవారం మదనపల్లి ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్లో శిక్షణ తరగతులలో డీఈవో ప్రారంభించారు. అనంతరం డీఈవో విలేకరులతో మాట్లాడుతూ చదువులో వెనుకబడిన వారు, వివిధ కారణాలతో పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరుకాని విద్యార్థులను గుర్తించి, వారికి నెల రోజుల పాటు ప్రత్యేక రెసిడెన్షియల్ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. విద్యార్థుల సౌకర్యార్థం జిల్లాలోని పలు ప్రాంతాల్లో శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. బాలుర కోసం మదనపల్లె, పీలేరు, రాయచోటిలోని ట్రైబల్ వెల్ఫేర్ (గిరిజన సంక్షేమ) పాఠశాలలు, ఓబులాపురంలోని సోషల్ వెల్ఫేర్ (సాంఘిక సంక్షేమ) పాఠశాలలో వసతితో కూడిన శిక్షణ ఉంటుందన్నారు. బాలికల కోసం ఆయా మండలాల్లోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల్లో శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ శిక్షణకు ఎంపికైన విద్యార్థులు తమ రెగ్యులర్ పాఠశాలలకు వెళ్లనవసరం లేదన్నారు. నెల రోజుల పాటు కేటాయించిన కేంద్రాల్లోనే ఉంటూ నిపుణులైన ఉపాధ్యాయుల పర్యవేక్షణలో చదువుకోవాలన్నారు. పరీక్షల్లో సులభంగా ఉత్తీర్ణత సాధించడానికి అవసరమైన ముఖ్యమైన అంశాలు, ప్రశ్నలపై ఇక్కడ ప్రత్యేకంగా కోచింగ్ ఇస్తారన్నారు. ఈ రెసిడెన్షియల్ ప్రోగ్రాంకు స్వచ్ఛందంగా అంగీకరించి, అంగీకార పత్రం సమర్పించిన విద్యార్థులను మాత్రమే తీసుకుంటున్నట్లు డీఈఓ స్పష్టం చేశారు. ఇప్పటికే 182 మంది విద్యార్థులు ఈ శిక్షణకు హాజరయ్యేందుకు ముందుకు వచ్చారని ఆయన తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు ప్రభాకర్ రెడ్డి, రాజగోపాల్, విద్యాశాఖకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు రూ.1 కోటి 60 లక్షలు మంజూరు

దువ్వూరు, ఫిబ్రవరి 09, ప్రభాతవార్త:

మండలంలోని 23 గ్రామ పంచాయతీలలో వివిధ రకాల అభివృద్ధి పనులకు ముఖ్యంగా సిసి రోడ్లకు కోటి 60 లక్షల రూపాయలు మంజూరు అయినట్లు పంచాయతీరాజ్ ఏఈ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఇటీవల మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ఆదేశాల మేరకు ఏఏ గ్రామాల్లో సీసీ రోడ్లు అవసరమో వాటిని అంచనాలు వేసి పంపామని ఆ అంచనాల మేరకు ఎమ్మెల్యే వీటిని కేటాయించినట్లు తెలిపారు. ఇందులో దువ్వూరుకు 22 లక్షల రూపాయలు, గుడిపాడుకు 20, ఇడమడక 10, క్రిష్టంపల్లెకు 19, చిన్నసింగన పల్లెకు 25, చింతకుంటకు 17, నీలాపురానికి 16 లక్షలు అలాగే మిగతా పంచాయతీలకు కూడా 5 నుంచి 10 లక్షల రూపాయల మేర కేటాయించినట్లు తెలిపారు. ఈ నిధులతో గ్రామాలలో సిమెంట్ రోడ్లను మార్చి చివరి లోగా పూర్తి చేయవలసి ఉందన్నారు. ఉపాధి హామీ పథకం నిధులతో ఇవి మంజూరు అయినట్లు పేర్కొన్నారు.

## పిజిఆర్ఎస్‌లో వచ్చిన సమస్యలపై స్పందించాలి

పీలేరు ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:

సమావేశంలో మాట్లాడుతున్న తహసిల్దార్ శివకుమార్

మండల పరిధిలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కు అనుగుణంగా సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ లో వచ్చిన సమస్యలను త్వరగా పరిష్కరించాలని స్థానిక వీఆర్వోలను సర్వేయర్లను సిబ్బందిని ఆదేశించారు. సోమవారం స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో మాట్లాడుతూ ఇప్పటికే మండల పరిధిలో భూములు రిసర్వే కార్యక్రమం వేగవంతం చేశామని ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు ప్రతి గ్రామంలో జరిగే రీ సర్వే కార్యక్రమాన్ని స్వయంగా పరిశీలించడమే కాకుండా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని పరిష్కారం కాని సమస్యలను ఉన్నతాధికారులకు తెలియజేసి సమస్యలను పరిష్కరించేందుకు చొరవ చూపుతున్నామని తహసిల్దార్ అన్నారు. అదేవిధంగా ప్రభుత్వ భూములపై ఎవరైనా ఆక్రమణకు గురిచేయాలనుకుంటే క్రిమినల్ కేసులు తప్పవని ఆయన అన్నారు సోమవారం ఎర్రగుంటపల్లి గ్రామంలో కొంతమంది ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమిస్తున్నారని ఫిర్యాదు అందడంతో తక్షణము స్పందించిన తహసిల్దార్ రెవెన్యూ ఇన్స్పెక్టర్ మురగయ్య, విఆర్ఓ ఇమ్రాన్ ఖాన్ ను సంఘటన స్థలానికి చేరి నిలుపుదల చేసినట్లు ఆయన అన్నారు ప్రభుత్వ భూములపై ఎంతటి వారైనా ఆక్రమణకు గురి చేయాలని చూస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహసిల్దార్ ప్రసాద్ రెవెన్యూ ఇన్స్పెక్టర్ మురగయ్య, విలేజ్ రెవెన్యూ అధికారులు కళ్యాణి, సిద్దయ్య, అజయ్ ఎల్లప్ప ,వెంకటరమణ తో పాటు పలువురు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రహరీ గోడ లేదు. .. పట్టించు కోండి సార్లు..

సుండుపల్లె, ఫిబ్రవరి 09,ప్రభాతవార్త :

మండల పరిధిలోని పుల్లారెడ్డిగారిపల్లి సమీపంలో గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల 3.50 కోట్ల అంచనాతో 2016వ సంవత్సరంలో నిర్మాణం చేపట్టి 2024 నుంచి తరగతులుగా ప్రారంభించారు. ఈ పాఠశాలనందు 130 మంది పిల్లలు చదువుతున్నారు కాని,పాఠశాల చుట్టు ప్రహరీ గోడ నిర్మించలేదు.పాఠశాల లోపలకు, వంటగది లోపలకు,పాఠశాల పరిసర ప్రాంతాలలో జంతువులు, పాములు, విషపురుగుల వస్తుంటాయని విద్యార్థులు, ఉపాధ్యాయులు భయందోళనకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల చుట్టు ప్రహరీ గోడ నిర్మాణమునకు చర్యలు తీసుకోవాలని పిల్లల తల్లిదండ్రులు కోరుతున్నారు. ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు నాయుడు మాట్లాడుతు, ఏడాదిగా అధికారులకు విన్నవించు కొన్నా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఇప్పటికయినా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలన్నారు.

## కన్నతల్లి పై పెట్రోల్ పోసి నిప్పంటించిన కొడుకు

యర్రగుంట్ల : ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :

అప్పు తీర్చమన్నందుకు కన్నతల్లి పై పెట్రోల్ పోసి నిప్పంటించాడు ఓ కొడుకు. సోమవారం యర్రగుంట్ల సీఐ విశ్వనాథ్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు మండల పరిధిలోని పొట్లదుర్తి గ్రామం నందు సుందరమ్మ (90) కుటుంబ సభ్యుల వద్ద అప్పుగా 18 లక్షల కొడుకు జాకోబ్ (60) నగదును తీసుకున్నాడని ఆ అప్పు తిరిగి వారికి తీర్చమన్నందుకు కన్నతల్లి పై అతి కిరాతకంగా పెట్రోల్ పోసి జాకోబ్ నిప్పంటించాడని ఇది గమనించిన స్థానికులు హుటాహుటిన ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మెరుగైన చికిత్స కోసం కడప రిమ్స్ కు తరలించారని అక్కడ సుందరమ్మ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సీఐ వివరించారు. నిందితుడు పై హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నమన్నారు.

## విదేశాల్లో వెల్డింగ్ ఉద్యోగ అవకాశాలు అవగాహన సదస్సు

కడప, ఫిబ్రవరి 09 ప్రభాతవార్త :

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృది సంస్థ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ మరియు నేషనల్ అకాడెమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ సంయుక్తంగా రాయలసీమ ప్రాంతం లోని నిరుద్యోగ యువత కోసం, ఇతర దేశాల్లో వెల్డింగ్ మరియు నిర్మాణ రంగం నందు ఉద్యోగ అవకాశాలు మీద అవగాహన సదస్సును ఈ నెల 12 న గురువారం రోజున ఉదయం 10.30 గంటలకు పులివెందుల లోని నేషనల్ అకాడెమీ ఆఫ్ కన్స్ట్రక్షన్(విటిది) నందు నిర్వహించడం జరుగు తుందని జిల్లా ఉపాధి అధికారి సురేష్ కుమార్ సోమవారం ఒక ప్రకటన లో తెలిపారు. వెల్డింగ్ మరియు నిర్మాణ రంగం నందు విదేశాల్లో శిక్షణ ఇచ్చే సాఫ్కో ఇండస్ట్రియల్ ట్రైనింగ్ మరియు అసెస్మెంట్ వారి ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించ బడునని తెలిపారు. ఈ కార్యక్రమానికి 10వ తరగతి/ఐటీఐ/డిప్లొమా/ఇంజనీరింగ్ చదివి 19 సం నుండి 45 సం వయస్సు గల అభ్యర్థులు హాజరు అయ్యి సదస్సును సద్వినియోగం చేసుకోవాలనన్నారు. ఇతర వివరాలకు నాక్ బిల్డింగ్, పులివెందుల నందు లేదా 9000517637, 9701271158 ను సంప్రదించగలరని ఆ ప్రకటన లో తెలిపారు.

## గోడపత్రాల ఆవిష్కరణ..

సోమవారం కడప కలెక్టరేట్ లోని బోర్డు మీటింగ్ హాలులో.. యూరియాను అధికంగా వాడటం వల్ల ఎదురయ్యే దుష్ప్రభావాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు.. రాష్ట్ర వ్యవసాయ శాఖ వారు ప్రచురించిన గోడపత్రాలను జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, జేసీ డా. నిధీ మీనా, డీఆర్వో విశ్వేశ్వర నాయుడు, డిఎవో చంద్రానాయక్ తదితరులు పాల్గొన్నారు.

## బకాయిల చెల్లింపుకు రూట్ మ్యాప్ ప్రకటించాలి

**రాజంపేట, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త**

ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్ల బకాయిల చెల్లింపుకు రూట్ మ్యాప్ ప్రకటించాలని, వెంటనే పిఆర్సీ కమిషన్ నియమించాలని యూటీ ఎఫ్ జిల్లా కార్యదర్శులు పి.వెంకట సుబ్బయ్య,రమణ మూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారంరాజంపేట డిఆర్సి భవనంలో జరిగిన యుటిఎఫ్ సమావేశంలో ఉద్యోగుల డిమాండ్లపై వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రికి పై డిమాండ్లను నెరవేర్చాలని విజ్ఞప్తి చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా లక్షపై చిలుకు పైగా పోస్ట్ కార్డులను పంపిస్తున్నట్లు తెలిపారు. సీ పీ యస్ రద్దు చేయాలని, 2004కు ముందు నియామక ప్రక్రియ పూర్తి అయిన వారికి పాత పెన్షన్ అమలు చేయాలని, హెల్త్ కార్డుల మెడికల్ బిల్లుల సమస్యకు పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ రాజంపేట మండల అధ్యక్షుడు జి.నాగేంద్ర, గౌరవాధ్యక్షులు సాంబశివరావు, కోశాధికారి కె.శివ కుమార్, ఉపాధ్యాయులు రవిచంద్ర ప్రసాద్, సూర్యారావు, సుబ్బారాయుడు,వెంకట సుబ్బయ్య, వెంకటరమణ, చంద్రారెడ్డి, ఈశ్వర రాజు,భాస్కర సూరి, దేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక అక్రమ రవాణ రైతులు ఆందోళన

**సిద్ధవటం, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త**

రాష్ట్ర ప్రభుత్వం గృహ నిర్మాణ పనులకు పెన్నా పరివాహ ప్రాంతాల ప్రజలకు ఉచిత ఇసుక వెసులుబాటు చేసింది ఉచితం ముసుగులో ప్రభుత్వ ఖజానా గండి కొడుతూ నిత్యం ట్రాక్టర్ల ద్వారా కడపకు ఇసుక రవాణా చేస్తూ సొమ్ము చేసుకుంటున్న అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టలేదని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు సిద్ధవటం మండలంలోని ఉక్కాయ పల్లె పెన్నా నది నుండి నిత్యం కడపకు అక్రమంగా ట్రాక్టర్ల ద్వారా ఇసుక రవాణా చేస్తూ ఒక్కో ట్రాక్టర్ 5000 నుండి 6000 వేల రూపాయలు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని ప్రతిరోజు 50 ట్రాక్టర్లకు పైగా అక్రమంగా ఇసుక రవాణా చేస్తుమా పంట పొలాలు పరిసర ప్రాంతాల్లో ఇసుక గోతులు తీస్తూ ఇసుక తరలింపు చేస్తున్నారని భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయని అధికారులు పంట పొలాలు దృష్టిలో పెట్టుకొని అక్రమ ఇసుక రవాణా అరికట్టాలని రైతులు తెలిపారు అక్రమ ఇసుక రవాణా పై సిద్ధవటం మండల తాసిల్దార్ ఆకుల తిరుమల బాబు వివరణ కోరగా మాచుపల్లి పెన్నా నది నుండి అక్రమ ఇసుక రవాణా జరగకుండా రహదారి తొలగింపు చేపట్టామని ఉక్కాయ పల్లె పెన్నా నది నుండి అక్రమ ఇసుక రవాణా తరలింపు జరగకుండా జెసిబి యంత్రంతో రహదారి పూర్తిగా తొలగింపు చేపట్టి అక్రమ ఇసుక రవాణా అరికట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

## బిజెపి ప్రొద్దుటూరు అర్బన్ 1 నగర కమిటీ నియామకం

**ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త**

ప్రొద్దుటూరు భారతీయ జనతా పార్టీ 1 వ పట్టణ అధ్యక్షులు వంకదార నరేంద్రరావు సోమవారం బిజెపి నగర కమిటీని ప్రకటించారు. బిజెపి 1వ పట్టణ ఉపాధ్యక్షులుగా నంగునూరు ఓబులయ్య, కోశాధికారిగా దొంతు మురళీకృష్ణ, కార్యదర్శులు డింగిమల్ల సురేంద్రబాబు మార్తల సరోజ, గిద్దలూరు మోహన్ కృష్ణ, కార్యవర్గ సభ్యులుగా మార్తల ఓబుల్ రెడ్డి ని ప్రకటించారు. వీరి సేవలకు గుర్తింపుగా వీరికి పదవులు కట్టబెట్టినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. దాదాపు పది సంవత్సరాల నుండి పార్టీ కోసం పని చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శులు చెన్నా మోహన్ ముత్యాల శ్రీశ్రీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు ఎన్ కుమారి జిల్లా ఓబిసి అధ్యక్షులు వెంకట్ రాముడు, జిల్లా ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షులు పరమేశ్వరరావు, సుధాకర్ రెడ్డి, పద్మనాభయ్య కార్యదర్శి హరికృష్ణ, చిన్న మరియు బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా వైద్యాధికారి

**బ్రహ్మంగారిమఠం ఫిబ్రవరి 09 ప్రభాతవార్త**

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఆదేశాల మేరకు విధుల్లో నిరక్ష్యం వహించిన వైద్య సిబ్బందిపై సోమవారం జిల్లా వైద్యాధికారి నాగరాజు ఆకస్మికంగా బి.మఠం పీహెచ్సీని తనిఖీ చేసి విధుల్లో నిరక్ష్యం వహించిన సిబ్బందిని పిలిపించి విచారణ చేశారు. ఈనెల 8వ తారీకు అనగా ఆదివారం పిహెచ్సిలో వైద్య సిబ్బంది లేరన్న ఆరోపణపై ఆయన ఈ విచారణ చేపట్టారు. 8వ తేదీన జరిగిన పరిణామాలపై ఆయన విచారణ చేశారు.ఈ సందర్భంగా ఆయన విధుల్లో నిరక్ష్యం వహించిన సిబ్బందిని పిలిపించి,విచారించి వారి చేత రాతపూర్వకంగా సంజాయిషీ తీసుకోవడం జరిగింది.ఈ కార్యక్రమంలో బద్వేల్ డివిజనల్ డిప్యూటీ డిఎంఅండ్హెచ్వో డాక్టర్ మల్లేష్,డాక్టర్ సంపత్ కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## రాష్ట్ర కాపు నేతను పరామర్శించిన మాజీ మంత్రి

**బ్రహ్మంగారిమఠం ఫిబ్రవరి 09 ప్రభాతవార్త**

రాష్ట్ర కాపు నాడు ఉపాధ్యక్షులు శేగినేని పొతులూరయ్య తండ్రి తెలుగుదేశం నాయకులు లింగాలదిన్నెపల్లి ఆయకట్టు చైర్మన్ గురువయ్య ఆదివారం రోజు గుండె పోటుతో మృతి చెందారు. సోమవారం ఆయన పార్థివ దేహానికి కర్ణాటక మాజీ మంత్రి గాలి కరుణాకర రెడ్డీ నివాళులు అర్పించారు. అనంతరం పొతులూరయ్య కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియచేసారు. ఈయనతొ పాటు బి. మఠం టీడీపీ నాయకులు ముడుమల పోలిరెడ్డి బద్వేల్ బీజేపీ నాయకులు పోతురాజు కృష్ణ బద్వేల్ మాజీ కౌన్సిలర్ తుమ్మిశెట్టి వెంకట సుబ్బయ్య నోస్సవీరభద్ర స్వామీ పాల్గొన్నారు.

## మల్లయ్య కొండ మల్లయ్య దారు శారదయ్య మృతి

**తంబళ్లపల్లె ఫిబ్రవరి 9 ప్రభాతవార్త ః**

తంబళ్లపల్లె మల్లయ్య కొండ మహా శివుని సన్నిధిలో ఢమరుక వాయిద్యం వాయించే శారదయ్య సోమవారం అనారోగ్యంతో మృతి చెందాడు. పెద్దమండెం మండలం కొండ కింద కురువపల్లెకు చెందిన శారదయ్య దశాబ్దాలుగా మల్లయ్య కొండ స్వామి వారి సేవ లో భాగంగా పరిసర ప్రాంతాలలో మల్లయ్య దారుల వేషధారణలో మహాశివుని స్మరిస్తూ ప్రచారం నిర్వహించేవాడు. గత సోమవారం సైతం మల్లయ్య కొండలో స్వామి వారి సన్నిధిలో ఢమరుక వాయిద్యం వాయించి రెండు రోజులుగా తీవ్ర అస్వస్థతకు లోనై సోమవారం మృతి చెందాడు. శారదయ్య మృతిపై ఈఓ ముని రాజా, రికార్డ్ అసిస్టెంట్ కొండకిట్ట, అర్చకులు ఈశ్వరప్ప, మల్లికార్జున స్వామి, ఆలయ సిబ్బంది ఆయన స్వామి చేసిన సేవలను కొనియాడుతూ సంతాపం ప్రకటించారు.

## విద్యార్థులకు అవగాహన సదస్సు

**నిమ్మనపల్లె, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :**

మత్తు, మద్యం వంటి వాటిపై నిమ్మనపల్లె మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళావలలో సోమవారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీధర్ మాట్లాడుతూ విద్యార్థులు చిన్నవయసులో మత్తుకు భానిసై జీవితం నాశనం చేసుకుంటున్నారని అలా కాకుండా బాగా చదివి ఉన్నత శిఖరాలను అదిరోహించి తల్లిదండ్రులకు, కళాశాలలకు మంచిపేరు తేవాలన్నారు. కౌన్సిలర్ నాగరాజు మాట్లాడుతూ విద్యార్థులు చిన్న వయసులో మంచిగా ఎదగాలంటే దురలవాట్లకి దూరంగా ఉండాలని సూచించారు. చదువుకొన్న బడికి, కన్నవారికి మంచిపేరు తీసుకురావలని సూచించారు. ఈ సదస్సులో ఎన్ఎస్ఎస్ అధికారి రామాంజనేయులు, రెడ్డప్ప, నాగేశ్వర్రావు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్జిఎస్డబ్ల్యు సచివాలయ ఉద్యోగుల మరణాలపై ప్రభుత్వం స్పందించాలి

**కలసపాడు, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:**

స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డ్ సచివాలయ ఉద్యోగులు కుటుంబ సమగ్ర సర్వే, అక్షరాంధ్ర సర్వే, బూత్ లెవెల్ ఆఫీసర్ విధులు, డిపార్ట్మెంట్ విధులతో పాటు కొన్ని సచివాలయలలో అదనపు ఇంచార్జి విధులతో సతమతం అవుతూ తీవ్ర మానసిక ఒత్తిడి గురి అవుతున్నారని, రాష్ట్ర వ్యాప్తంగా గత రెండు నెలల లో దాదాపు 30 మంది సచివాలయ ఉద్యోగులు పని ఒత్తిడి, ఆరోగ్య సమస్యలు, యాక్సిడెంట్ తదితర కారణాలతో మరణించారాని, దీనిపై ప్రభుత్వం స్పందించి సమగ్ర విచారణ జరిపించాలని యునైటెడ్ వెల్ఫేర్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ తరపున రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దేశ్వర రెడ్డి ఒక ప్రకటన లో పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూఅన్నమయ్య జిల్లా, బి. కొతకోట మండలం లో వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ సుబ్రహ్మణ్యం పని ఒత్తిడి తో ఆత్మహత్య చేసుకోవడం బాధాకరం. కుటుంబ సమగ్ర సర్వే లో భాగంగా చనిపోయిన వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ కి దాదాపు 888 కుటుంబాల డేటా సర్వే చేయమని కేటాయించడం దారుణం అని, దాని తో పాటు బిల్వో విధులు, డిజిటల్ అసిస్టెంట్ గా అదనపు విధులతో మానసిక క్షోభ తో ప్రాణాలు కోల్పోవడం ఆ కుటుంబం నకు తీవ్ర అన్యాయం జరిగిందని, సుబ్రహ్మణ్యం ఆత్మ హత్య పై పూర్తి స్థాయి విచారణ పరదర్శకంగా జరిపి, వారి కుటుంబం ప్రభుత్వం ఆదుకోవాలని మా అసోసియేషన్ తరపున విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఉన్నత అధికారులు క్షేత్ర స్థాయి సచివాలయ ఉద్యోగుల పై వివిధ రకాల పనులను ఒకేసారి చేయమని ఒత్తిడి చేయడం సరికాదని, అప్పగించే పనుల పై సమన్వయం ఉండేలా చర్యలు తీసుకోవాలని, సర్వే లకు సరైన సమయం ఇచ్చి అనుకూల పని వాతావరణం ఉండేలా చూడాలని రాష్ట్ర ప్రభుత్వం ను కోరుకుంటున్నామన్నారు.

## చెరువులో మృతదేహం లభ్యం

**పొరుమామిళ్ల రూరల్, ప్రిబ్రవరి 9 ప్రభాతవార్త:**

పొరుమామిళ్ల మండలంలోని డంపింగ్ యార్డ్ వద్ద ఉన్న రెడ్డి కథువా చెరువులో మృతదేహం లభ్యమైంది. మృతి చెందిన యువకుడు కలసపాడు మండలం ముద్దం వారి పల్లికి చెందిన ఇమ్మానుయేలుగా (18) పొరుమామిళ్ల పోలీసులు గుర్తించారు. సంఘటనా స్థలానికి వెళ్లి పొరుమామిళ్ల ఎస్ఐ హనుమంతు, సిబ్బంది దర్యాప్తు చేపట్టారు.పూర్తి వివరాలు పోలీస్ విచారణ లో తెలియాల్సి ఉంది.

## ఉపాధి హామీ చట్టాన్ని యధావిధిగా కొనసాగించాలి

**పొరుమామిళ్ల రూరల్, ప్రిబ్రవరి 9 ప్రభాతవార్త:**

బిజెపి ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం మార్పులు చేసి కుట్రపూరితంగానే వ్యవసాయ కూలీలకు పనులు లేకుండా చేయాలని చూస్తున్నదని బూటకపు మాటలు చెబుతున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల తీరు నిరసిస్తూ సిపిఐ, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం సంయుక్తంగా పొరుమామిళ్ల ఏపీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు.ఈ ధర్నాను ఉద్దేశించి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వీరశేఖర్ మాట్లాడుతూ ఈ దేశంలో రాష్ట్రంలో వలసలు ఆత్మహత్యల నివారణ కోసం ఎన్నో పోరాటాల ఫలితంగా 2005లో అప్పటి యూపీఏ ప్రభుత్వం హయాంలో వామపక్షాల కృషితో తీసుకొచ్చిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం నేడు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి నచ్చకపోవడంతో ఈ పథకాన్ని నిర్వీర్యం చేయడానికి పేరు మాత్రమే మార్చారని అందరూ భావిస్తున్నప్పటికీ నేడు కొత్తగా తీసుకొచ్చిన బిల్లు వల్ల మళ్ళీ ఇతర రాష్ట్రాలకు దేశాలకు వలసల బాట పట్టాల్సిన పరిస్థితి వస్తున్నదన్నారు. ఎందుకంటే గత పాలకులు ఈ రాష్ట్రంలో 10 శాతం నిధులు కూడా ఉపాధి హామీకి ఖర్చు చేయలేదని నేడు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన బిల్లులో 60 శాతం కేంద్రం 40 శాతం రాష్ట్ర ప్రభుత్వం భరించాలని బిల్లులో ప్రవేశ పెట్టడం చూస్తుంటే నిజంగా వ్యవసాయ కూలీలకు న్యాయం జరుగుతుందా అనే అనుమానం వస్తున్నదన్నారు.

## బిజెపి మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శిగా సుష్మా

**వేంపల్లె:ఫిబ్రవరి 09(ప్రభాత వార్త)**

బిజెపి మహిళా మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పెడబల్లి సుష్మాని ఆ పార్టీ అధిష్టానం నియమించింది. గతంలో సుష్మా జిల్లా ఉపాధ్యక్ష పదవి కూడా చేపట్టారు. నిరంతరం పార్టీ అభివృద్ధికి, ప్రజా శ్రేయస్సుకు కృషి చేస్తూ మంచి గుర్తింపు పొందారు. దీంతో ఆమె సేవలను గుర్తిస్తూ ఏపి బిజెపి అధిష్టానం ఈ పదవి బాధ్యతలు అప్పగించడం జరిగింది. దీంతో ఆమె విలేకరులతో మాట్లాడుతూ తన సేవలను గుర్తించి ఈ పదవి బాధ్యతలు అప్పగించడం సంతోషాన్ని కలిగించిందని, పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి మరింత కృషి చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. ఆ పదవి బాధ్యతలపై సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు పివీఎన్ మాధవ్, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్, రాష్ట్రనేతలు మధుకర్, దయాకర్ రెడ్డి, శశిభూషణ్ రెడ్డి, ఎమ్మెల్యే ఆది నారాయణ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు జెవి సుబ్బారెడ్డికీ కృతజ్ఞతలు తెలియజేశారు.

### వేంపల్లె చాగలమర్రి రహదారి

## విస్తరణకు మోక్షం ఎప్పుడో!

**వేంపల్లె:ఫిబ్రవరి 09(ప్రభాత వార్త)**

వేంపల్లె చాగలమర్రి రహదారి విస్తరణకు మోక్షం ఎప్పుడు అని ఏపిసిసి నేత డా.తులసిరెడ్డి ప్రశ్నించారు. ఆ రహదారి విస్తరణ పనులు మంజూరై రెండేళ్లైనా పనులు ప్రారంభం కాలేదన్నారు. దీనికి కారణం భూసేకరణ కార్యక్రమం పూర్తి కాలేదని, జిల్లా అధికార యంత్రాంగం, ప్రత్యేకించి జాయింట్ కలెక్టర్ శ్రద్ధ తీసుకుని వీలైనంత తొందరగా భూసేకరణ పూర్తి చేసి, రహదారి విస్తరణ పనులు ప్రారంభించాలని తులసిరెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు డా.సుబ్రమణ్యం, ప్రసాద్ గౌడ్, సుబ్బారెడ్డి, రామకృష్ణ, అమర్, ఉత్తన్న, రవీంద్రనాథ్ రెడ్డి, వెంకటేష, నాగరాజు, రమణ, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## రోజ్ కోకోనట్ బర్ఫీ

**కావలసినవి :** కొబ్బరి తురుము-3 కప్పులు, పంచదార-2 కప్పులు, పాలు-అర కప్పు, పాలపొడి-అర కప్పు, రోజ్ సిరప్-పావు కప్పు, నెయ్యి 2 చెంచాలు, యాలకుల పొడి-అర చెంచా, డ్రైఫ్రూట్స్ పలుకులు- చారెడు.

## సర్కిల్ ఇన్స్పెక్టర్ గా బాధ్యతలు చేపట్టిన మస్తాన్..

**సుండుపల్లి, ఫిబ్రవరి 09,ప్రభాతవార్త :**

సుండుపల్లె వీరబల్లె మండలాలకు నూతనంగా ఏర్పాటు చేసిన సర్కిల్ కార్యాలయంలో సర్కిల్ ఇన్స్పెక్టర్గా మస్తాన్ బాధ్యతలు చేపట్టారు.ఆయన మాట్లాడుతూ, శాంతి భద్రతల పరిరక్షణకు పూర్తి స్థాయిలో కృషి చేస్తానని తెలిపారు. ప్రజల సమస్యలకు సత్వర స్పందన ఉంటుందని, బాధితులకు న్యాయం చేయడమే లక్ష్యంగా పనిచేస్తానన్నారు. మహిళల భద్రత, యువతను మత్తు పదార్థాల నుండి దూరంగా ఉంచడం, అసాంఘిక కార్యక్రమాల నివారణకు కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ సందర్భంగా జనసేన సీనియర్ నేత రామా శ్రీనివాస్ మరియు పలువురు కూటమి నాయకులు కలిసి సర్కిల్ ఇన్స్పెక్టర్ను శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతు ప్రజాసమస్యలు పట్ల సకాలంలో స్పందించాలని ప్రజలకు మేలైన సేవలు అందించాలని, ఎలాంటి అసాంగిక కార్యక్రమాలు జరగకుండా కట్టడి చేయాలని, మహిళలకు రక్షణకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, యువత చెడు అలవాట్లకు మత్తుపదార్తల వైపు వెళ్ళ కుండా చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ ఏంపిటిసి నంద్యాల రామయ్య, వెంకయ్య, జయరాం పాల్గొన్నారు.

## పెరుగు మిగిలితే..

కూరల్లాగే పెరుగు మిగిలిపోయినా మరుసటి రోజు తినడానికి కొంతమంది ఇష్టపడరు. అలాంటప్పుడు దాన్ని బయటపడేయడం కాకుండా.. వంటింట్లో కొన్ని వంటకాలు, ఇతర పనుల కోసం వాడుకోవచ్చుంటున్నారు నిపుణులు. తద్వారా వాటి రుచి పెరగడంతో పాటు ఆరోగ్యాన్నీ సొంతం చేసుకోవచ్చుంటున్నారు. అదెలాగో తెలుసుకుందాం..

◆ మిగిలిపోయిన పెరుగును అలాగే తినడానికి ఇష్టపడని వారు దాన్ని పండ్ల రసాలు, స్మూతీస్ తయారీలోనూ వాడచ్చు. ఈ క్రమంలో స్మూతీస్ చేసే క్రమంలోనే బ్లెండర్లో పండ్లు, తేనె, కొన్ని ఐస్ముక్కలతో పాటు కొద్దిగా పెరుగు వేసి.. బ్లెండ్ చేస్తే దాన్ని రుచి పెరుగుతుంది.

◆ మాంసాహారం వండే ముందు వాటిని మ్యారినేట్ చేయడం మనకు తెలిసిందే. అయితే ఈ క్రమంలో పెరుగును కూడా కలిపితే.. మాంసం ముక్కలు మరింత మృదువుగా మారి త్వరగా ఉడుకుతాయి. అలాగే కూర రుచి కూడా పెరుగుతుంది.

◆ సలాడ్ గార్నిష్/డ్రస్సింగ్ కోసం కొత్తిమీర/పుదీనాన వంటి ఆకులు, నిమ్మరసం, వెల్లుల్లి ముక్కలు, ఆలివ్ నూనె.. వంటివి వాడుతుంటాం. అయితే క్రీమీగా చిలికిన పెరుగును వాటి పైనుంచి సన్ననటి తీగలాగా పోస్తే.. సలాడ్ నోరూరిస్తుంది. తింటుంటే మధ్యమధ్యలో పుల్లపుల్లగా నోటికి తగులుతుంటుంది. ◆. చిప్స్, క్రాకర్స్, కాల్చిన కాయగూర ముక్కలు, ఫ్రెంచ్ ఫ్రైస్.. వంటి వాటిని వివిధ రకాల పదార్థాలతో తయారుచేసిన డిప్పింగ్ సాస్లో ముంచుకొని తింటుంటాం. అయితే ఈడిప్స్ తయారీలో కొద్దిగా పెరుగును ఉపయోగిస్తే.. వాటి రుచి, చిక్కదనం పెరుగుతుంది.

◆. అంతేకాదు.. పెరుగుతోనూ రుచకరమైన డిప్ తయారుచేసుకోవచ్చు. పెరుగును ఒక క్లాత్లో వేసి అందులోని నీటిని తీసేయాలి. ఇప్పుడు దీన్ని బాగా చిలికితే క్రీమీగా తయారవుతుంది. ఇందులో మీ రుచికి తగినట్లుగా చిల్లీ ఫ్లేక్స్, మిరియాల పొడి కలుపుకోవచ్చు. కావాలంటే సన్నగా తరిగిన ఉల్లిపాయ ముక్కలు, స్వీట్కార్న్.. వంటివి జత చేసుకుంటే మరింత రుచిగా ఉంటుంది.

◆. మిగిలిపోయిన పెరుగుతో రైతా, మజ్జిగ చారు వంటివి తయారుచేసుకోవచ్చు. అలాగే ఈ పెరుగుకు నీళ్లు, చక్కెర, రోజ్వాటర్.. వంటి పదార్థాల్ని కలుపుకొని రుచికరమైన లస్సీ కూడా తయారుచేసుకోవచ్చు.

◆. కేక్స్, మఫిన్స్, ప్యాన్కేక్స్.. వంటి బేకింగ్ వంటకాల్లో పెరుగు లేదంటే దాన్నే కాస్త చిలికి క్రీమీగా మారాక ఉపయోగించచ్చు. దీనివల్ల బేక్ చేశాక అవి మరింత మృదువుగా వస్తాయి. వాటి రుచీ ఇనుమడిస్తుంది.

◆ క్రీమీగా చిలికిన పెరుగును చిక్కీలు, గ్రానోలా బార్స్ పై తీగలా గార్నిష్ చేసి తీసుకుంటే.. తియ్యతియ్యగా, పుల్లపుల్లగా రుచి భలే ఉంటుంది. ఆరోగ్యానికి ఆరోగ్యం కూడా. ◆. మిగిలిపోయిన పెరుగు, పండ్ల ముక్కలు,కాస్త తేనె.. ఈ మూడింటినీ పాప్సికల్ మాల్డ్స్లో వేసి కొన్ని గంటల పాటు డీప్ ఫ్రిజ్లో పెట్టేయండి. తద్వారా ఐస్క్రీమ్ తయారవుతుంది. ఇది రుచిగా ఉండడమే కాదు. ఆరోగ్యానికీ మంచిది. పిల్లలకిస్తే యమ్మీగా లాగించేస్తారు. 10. కొన్ని రకాల మసాలా వంటకాల్లో పెరుగు ఉపయోగించడం తెలిసిందే! అయితే దీంతో పాటు టిస్పూన్ కూడా కలిపితే..కూరకు అదనపు రుచిని జోడించచ్చు.

## వృత్తి నైపుణ్యాలు నేర్పుతూ..

అన్నం పెడితే ఆ రోజుకు వాళ్ల పొట్ట నిండుతుంది. అదే వాళ్లకు వృత్తి నైపుణ్యాలు నేర్పిస్తే.. జీవితాంతం ఆ ఆసరాతో బతుకుతారు అంటారు ఓర్నా సంస్థ వ్యవస్థాపకురాలు జుంకీ అయ్యంగార్. మహారాష్ట్రలోని నిరక్షరాస్యులైన గ్రామీణ మహిళలకు జూట్, కాంతా ఎంబ్రాయిడరీతో గృహోపకరణాలూ, యాక్సెసరీల తయారీలో శిక్షణ ఇచ్చి, అనేకమంది మహిళలను ఉపాధి బాట పట్టిస్తోందీమె.

ఓర్నీ.. నా భావోద్వేగంలోంచి వచ్చిన ఆలోచన. రోజూ మా ఇంటి ముందు నుంచి సుందర్బాయి అనే మహిళ కట్టెల మోపు తలపై పెట్టుకుని వెళ్తుండేది. వెళ్తూ వెళ్తూ చిరువ్వుతో పలకరించేది. నేను మధ్య తరగతి కుటుంబంలో పుట్టినా అదృష్టం కొద్దీ బాగా చదువుకునే అవకాశం వచ్చింది. ఆమెకు ఆ అవకాశం రాక అలా ఉండిపోయింది. అందుకే అలాంటి వారికి ఏదైనా చేయాలనుకున్నా. 57 ఏళ్ల వయసులో 2018లో 'ఓర్నా' ఎంటర్ప్రైజ్‌ను ప్రారంభించా. ఇది నా జీవితానికి సరికొత్త అర్థాన్ని ఇస్తుందని భావించా'

అంటారు 63 ఏళ్ల జుంకీ. రాజీలేకుండా... కొత్తగా నేర్చుకున్న వాళ్లయినా సరే.. నాణ్యత, డిజూనుల్లో రాజీ పడకుండా, గంటల కొద్దీ సమయం వెచ్చించి ఓపిగ్గా నేర్పిస్తున్నారు మరి.. పర్యావరణానికీ హానికలగకూడదు కదా! అందుకే స్క్రాప్ తోనూ ఉత్పత్తులు తయారుచేస్తున్నారు. ప్యాకేజింగ్ కోసం కూడా అప్సైకిల్ చేసిన చీరలనే ఉంచితే మంచి ఆదరణ లభించింది. సోషల్ ఇంపాక్ట్ వర్క్, మార్కెట్ ఇంక్యుబేటర్గానూ ఎంపికైంది. అందులోని రెండు ఉత్పత్తులు 'ది బెస్ట్ న్యూ ప్రొడక్ట్'గానూ ఎంపికయ్యాయి. అంతేకాదు, గ్రామీణ వ్యాపారుల సాధికారత కోసం పుణెలో జరిగే భీమతడీ యాత్రకూ 'ఓర్నా' డిజైన్లు ఎంపికయ్యాయి. గతేడాది ఈ ఉత్పత్తులను హైదరాబాద్, ఢిల్లీలో ఎగ్జిబిషన్లలోనూ ప్రదర్శనకు ఉంచారు. బొటిక్లకూ, విదేశాకు ఎగుమతి చేస్తూ, ఏటా రూ.10-12 లక్షల టర్నోవర్ సాధిస్తున్నారు.

## పర్యావరణానికి మేలు చేస్తూనే..

తక్కువ ధరకే వస్తున్నాయని కొనడం.. ఆపై బోర్ కట్టేసింది, ఇదిప్పుడు ఫ్యాషన్ కాదు అని పక్కన పెట్టేయడం. చాలామంది చినగకపోయినా దుస్తులు పక్కన పడేయడానికి ప్రధాన కారనాలు ఇవేనట! ఇలాగైతే భూమిపై బోలెడు వృథా పేరుకుంటుందిగా? ఇక డిజైనర్లు, వస్త్ర పరిశ్రమల నుంచి వచ్చే వృథి సంగతి సరే సరి! దీన్ని అరికట్టాలనుకుంది అషితా సింఘాల్. పర్యా వరణానికి మేలు చేస్తూనే రూ.కోట్లనూ సంపాదిస్తోంది.

ఉమ్మడి కుటుంబం. దీంతో అషితాకి ప్రతి వస్తువునీ జాగ్రత్తగా వాడుకోవడం చిన్నప్పటి నుంచే అలవాటైంది. ఇంట్లో చిన్నది. మురిపెంగా అన్నీ నేర్పేవారు. అలా గార్డెనింగ్ మెలకువలు నేర్చుకున్న తనకు పర్యావరణంపైనా ప్రేమ ఏర్పడింది. ఈమెది ఢిల్లీ. బీకాం ఆనర్స్ పూర్తయ్యాక పెరల్ యూనిర్సిటీ నుంచి ఫ్యాషన్ డిజైనింగ్లో పిజిలో చేరింది. అప్పుడే నేర్చుకునే క్రమంలో ఎంత వస్త్రం వృథా పేరిటచెత్తబుట్ట పాలవుతోందో అర్థమైంది. ఇక ఫాస్ట్ ఫ్యాషన్ఎంత చెత్తకు కారణమవుతోందో చూడాగ్రహించింది. దీనికి ఏదైనా పరిష్కారం కనుక్కోవాలి అనుకుంది. అషిత. సరిగా అప్పుడే ఆమెకు అమెరికాలోని 'లారెట్ ఇంటర్నేషనల్ యూని వర్సిటీ నెట్వర్క్' నిర్వహించే ఫ్యాషన్ పోటీలో పాల్గొనే అవకాశం వచ్చింది. దీనిలో ప్రపంచవ్యాప్తంగా ఫ్యాషన్ విద్యార్థులు పాల్గొంటారు. గెలిచినవారికి పెద్ద మొత్తంలో స్పాన్సర్షిప్తోపాటు వ్యాపారం నిర్వహించుకోవడానికి అవసరమైన మెంటార్షిప్ కూడా దొరుకుతుంది.

**ఆ తికమకలో ...** సమస్యల్లా.. ఏం చేయాలనే!

ఓ వైపు పెరుగుతున్న వృథా ఆమె బుర్రను తొలిచేస్తోంది. మరోవైపు వచ్చిన అవకాశాన్ని అందుకుని నిరూపించుకోవాల్సిన పరిస్థితి. ఆ తికమకలో ఉండగా.. పడేసే ఆ వస్త్రాల ముక్కలతోనే ఏదైనా చేస్తే అన్న ఆలోచన వచ్చింది. ఆలోచన రావడం తడవు డిజైనర్లు, నేతకారులు, వస్త్ర తయారీ సంస్థలను కలిసింది. ఏదో హాబీ కోసం చేస్తున్నావు. కొద్దిరోజుల్లో నువ్వే ఆలోచన మానుకుంటావనేవారు. కానీ తను పట్టు వదల్లేదు. నోయిడాలో చిన్న

## సాంఘిక సంక్షేమ శాఖ ఉత్తర్వులను అమలు చేయాలి

పీలేరు ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:

తహశీల్దారుకు ఉత్తర్వులు సమర్పిస్తున్న నాయకులు

ప్రభుత్వ భూమిపై డిసెంబర్ 29న జిల్లా సాంఘిక సంక్షేమశాఖ సాధికారిత అధికారి కార్యాలయ ఉత్తర్వులను అమలు చేయాలని మాలమహానాడు, సి.ఆర్.డి.యస్ నాయకులు పీలేరు తహశీల్దారు శివకుమార్ కు ఉత్తర్వుల కాపీని అందజేశారు. పీలేరు రెవిన్యూ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వారు తహశీల్దారును కలిసి, పీలేరు మండలం, దొడ్డిపల్లి పంచాయతీ, సర్వే నెం 1414లోని ప్రభుత్వ భూమిని అంబేద్కర్ భవనం నిర్మాణం కోసం కేటాయించాలని, అదేవిధంగా గూడరేవుపల్లి పంచాయతీ, సర్వే నెంబర్ 198లో అంబేద్కర్ భవనం కోసం కేటాయించిన భూమిని రద్దు చేయాలని కోరారు. ప్రజా ప్రయోజనార్థం అనువైన చోట భూమిని కేటాయించాలని 2025 డిసెంబర్ 24న అన్నమయ్య జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ సాధికారిత అధికారి సి. దామోదర్ రెడ్డికి పలు ప్రజా సంఘాల నాయకుల అభిప్రాయాలతో కూడిన వినతి పత్రాన్ని సమర్పించగా, స్పందించిన సాంఘిక సంక్షేమ శాఖ సాధికారిత అధికారి డిసెంబర్ 29న పీలేరు తహశీల్దారు కార్యాలయానికి ఉత్తర్వులు జారిచేసి 43 రోజులు అవుతోందని, ఇకనైనా సంబంధిత ఉత్తర్వులపై విచారణ జరిపి, సమగ్ర నివేదికను జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ సాధికారిత అధికారికి అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సి.ఆర్.డి.యస్. అధ్యక్షురాలు కె. రాజమ్మ, ప్రధాన కార్యదర్శి కె. గట్టప్ప పాల్గొన్నారు.

## వేణుగోపాలునికి అష్టమి పూజలు

చౌడేపల్లి, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త

స్థానిక శ్రీ రుక్మిణీ, సత్యభామా సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో మాఘమాసం అష్టమిని పురస్కరించుకొని విశేష పూజలు జరిగాయి. ఉదయాన్నే ప్రధానార్చకుడు వశిష్టాచార్యుల ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు పంచామృతాభిషేకం, విశేషాలంకరణ గావించారు. మాఘాష్టమి కావడంతో వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకొన్నారు. నిర్వాహకులు వారికి పవిత్ర తీర్థ ప్రసాదాలందించారు.

## స్కూటర్‌ను ఢీకొన్న కారు : ఇద్దరికి గాయాలు

చౌడేపల్లి, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త

గాయపడ్డ స్కూటరిస్టులు

స్కూటర్‌ను కారు ఢీకొనడంతో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డ సంఘటన చోటు చేసుకుంది. చౌడేపల్లి నుంచి బోయకొండ మీదుగా మదనపల్లికి వెళ్ళే ప్రధాన రహదారిలో చౌడేపల్లి వైపు వస్తున్న టూవీలర్‌ను మదనపల్లి వైపు వెళుతున్న కారు కృష్ణాపురం ఒంటిమిట్ట వద్ద ఢీకొన్నది. ఈ ప్రమాదంలో స్కూటరిస్టులు మండలంలోని మర్రిమాకులపల్లికి చెందిన బాలకృష్ణ(43)కు రెండు కాళ్ళు, కుడిచేయి విరిగిపోయాయి. అదే గ్రామానికి చెందిన వెంకట్రెడ్డి(40)కి కాలు విరగడంతో పాటు తలకు బలమైన గాయమైంది. గాయపడ్డ వీరిని మదనపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ ఇరువురి ఆరోగ్య పరిస్థితి విషమించడంతో తిరుపతి రుయాకు రెఫర్ చేసారు.

## విదేశీ భాషలపై పట్టు పెంచుకోవాలి

కురబలకోట ఫిబ్రవరి 9 ప్రభాతవార్త

పోటీ ప్రపంచంలో రాణించాలంటే విదేశీ భాషలపై కూడా పట్టు సాధించాలని మీట్స్ పూర్వ విద్యార్థి జె. మనీషా అన్నారు. సోమవారం మిట్స్ డీమ్డ్ టుబి యూనివర్సిటీ నందు ఏం.బి.ఏ విభము వారు కెరీర్ డెవలప్మెంట్ అకాడమిక్ ఎక్సలెన్స్‌పై అవగాహన వర్క్షాప్‌ను నిర్వహించినారు. ఈ కార్యక్రమానికి పూర్వ విద్యార్థి జె. మనీషా మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఉద్యోగాలు పొందడానికి విపరీతంగా పోటీ ఉన్న తరుణంలో విద్యార్థులు ఫారిన్ లాంగ్వేజస్ నేర్చుకోవడం, ఎస్.ఏ.పి.ట్యాలీ, పవర్‌బిఐ, ఎనాలిటిక్స్, వంటి కోర్సులు నేర్చుకోవాలని తెలిపారు. తమ సంస్థ అయిన ట్రూ బిగిన్స్ ప్రవైట్ లిమిటెడ్ ద్వారా యూనివర్సిటీ లోని 20 మంది విద్యార్థులకు ఉద్యోగ అవకాశం కల్పిస్తామని ఆమె అన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, విభాగాధిపతి మరియు డీన్ డాక్టర్ భానుశ్రీ రెడ్డి పాల్గొన్నారు.

## భూమిలేని పేదలకు భూ పంపిణీ చేపట్టాలి

సిద్ధవటం, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామీణ వలసలు నివారించడానికి కేంద్రంలో ఉన్న ప్రభుత్వం మహాత్మజాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులు కూలీలకు 200 రోజులు పని దినాలు పెంచాలని భూమిలేని పేదలకు భూ పంపిణీ అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి అన్వేష్ పేర్కొన్నారు. మండలంలో శాఖరాజు పల్లి పెద్దపల్లి రెవిన్యూ పొలాలలో భూకజ్జాలు చేసి రాష్ట్రంలో ఏ పార్టీ అధికారం ఉంటే ఆ పార్టీలోకి వెళ్లి పెత్తనం చలాయిస్తూ తమ ఆస్తులు కాపాడుకుంటున్నారే తప్ప పేదలకు ఎలాంటి న్యాయం చేయలేదని భూమిలేని నిరుపేదలను గుర్తించి భూపట్టాలు మంజూరు చేయాలని, కడప చెన్నై జాతీయ రహదారిలో పెద్దపల్లి, ఉప్పరపల్లి రెవిన్యూ ప్రభుత్వ భూములు ఎన్నో అన్యాక్రాంతాలు అయ్యాయని, ప్రభుత్వ స్థలాలు గుర్తించి కబ్జాకు గురి కాకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేసి భూ పంపిణీ చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ సురేష్‌బాబు జిల్లా కార్యదర్శి జకరయ్య, ఉపాధ్యక్షులు వెంకటసుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఏపీ ఎన్జిజివో రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా ప్రసాద్‌యాదవ్

లక్కిరెడ్డిపల్లి: ఫిబ్రవరి 09 ప్రభాతవార్త

ఏపీ ఎన్జిజివో రాష్ట్ర కార్యవర్గ ఎన్నికలు విజయవాడ ఎన్జీవో భవన్ నందు జరిగాయి. రాష్ట్ర అధ్యక్షులు అలపర్తి విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి డివీ రమణ కార్యవర్గంలో ఉమ్మడి కడప జిల్లా నుండి నాల్గొసారి రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రసాద్‌యాదవ్‌ను ఎన్నుకున్నారు. గతంలో లక్కిరెడ్డిపల్లి ఎన్జీవో అధ్యక్షులుగా 25 సంవత్సరాలు, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా 9 సంవత్సరాలు ఉద్యోగుల సంక్షేమం కోసం పని చేసారు. ఈ సందర్భంగా ప్రసాద్ యాదవ్ మాట్లాడుతూ తిరిగి నన్ను నల్గొవ సారి రాష్ట్ర కార్యవర్గంలో అవకాశం కల్పించిన కామ్రేడ్ అలపర్తి విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి డివి రమణ, ఉమ్మడి కడపజిల్లా అధ్యక్షులు బి.శ్రీనివాసులు కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## గర్భిణులకు వైద్య పరీక్షలు

నందలూరు, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :

ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ కార్తిక్ విశ్వనాథ్ మాట్లాడుతూ గైనకాలజిస్ట్ డాక్టర్ మస్తానమ్మ 29 మంది గర్భవతులకు స్కానింగ్ చేసి సలహాలు, సూచనలు ఇచ్చారన్నారు. అవసరం అయిన వారికి మందులు పంపిణీ చేశామన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్భవతులకు బిపి ,రక్త పరీక్షలు నిర్వహించడంతో పాటు మందులను ఉచితంగా పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో సిహెచ్ఓ వెంకటనారాయణ, ఎంఎల్ హెచ్‌పి లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## బాల కార్మిక వ్యవస్థ ను నిర్మూలిద్దాం

సదుం ఫిబ్రవరి 9ప్రభాతవార్త

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పీలేరు సహాయ కార్మిక అధికారి జగదీశ్ బాబు అన్నారు. సోమవారం సదుం మండలకేంద్రంలో పలు దుకాణాలు, పలు ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు నిర్వహించారు. బాల కార్మికులను పనులలో నియమిస్తే చర్యలు తప్పవని వర్తక వ్యాపారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆయన తోపాటు, మండల విద్యా శాఖాధికారి దామోదర్, ఏ.ఎస్.ఐ. సత్యనారాయణ, సదుం గ్రామ దుకాణ మరియు సంస్థల యజమానుల సంఘం నుండి దండపాణి మరియు గణేష్ రెడ్డి, కార్మిక శాఖ సిబ్బంది దినేష్ తదితరులు పాల్గొన్నారు.

## గంగమ్మ జాతర ఉత్సవ కమిటీ చైర్మన్గా వెంకటేశ్వర్లు

లక్కిరెడ్డిపల్లి ఫిబ్రవరి 9 ప్రభాతవార్త

గంగమ్మ జాతర ఉత్సవ కమిటీ చైర్మన్గా సోడి వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. ఈ సందర్భంగా దేవాలయ ధర్మాదాయ శాఖ సోమవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆయన తెలిపారు అనంతరం గంగమ్మ దేవాలయం నందు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మదనమోహన్ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలకుండా ప్రశాంతంగా జాతర నిర్వహిస్తామని ఆయన సన్మానించారు నేను నియమాకంపట్ల పలువురు ఆశ వ్యక్తం చేశారు.

## శివాలయాల్లో ప్రత్యేక పూజలు

సదుం ఫిబ్రవరి 9 ప్రభాతవార్త

మండలం పరిధిలోని పలు శివాలయాల్లో మాఘ అష్టమి సందర్భంగా నుదేవిదంగా సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాంద్రపేటలోని శ్రీ అరుణాచలేశ్వర స్వామి ఆలయంలోనూ శ్రీ సుబ్రమణ్య స్వామి వారి ఆలయంలోని శ్రీ మరకత లింగేశ్వర స్వామి వారికి శ్రీ మల్లికార్జున స్వామి వారికి ఉదయంపంచామృత అభిషేకం చేశారు. అనంతరం స్వామి వార్లకు ఆభరణాలు, పుష్పాలతో అలంకరించి విశేషపూజలు చేసి మహామంగళహరతి ఇచ్చారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అదేవిధంగా తిమ్మానాయనపల్లి పంచాయతీ సజ్జలవారిపల్లెలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలోనూ అర్చకులు వెంకటరమణ శర్మ సాయినాథ్ శర్మ లు ప్రత్యేక పూజలు చేసి విశేషంగా అలంకరించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు వినియోగించారు.

## ప్రభుత్వాసుపత్రిలో ప్రసవాల సంఖ్య పెరగాలి

తొండూరు ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం యందు ప్రధాన మంత్రి మాతృత్వ సురక్ష అభియాన్ కార్యక్రమం డాక్టర్ ముంతాజ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మండల పరిదిలోని గర్భవతులకు గర్భస్త పరీక్షలు, రక్త పోటు, మధుమేహం, హీమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించి స్రీల వ్యాధినిపుణుల సేవలు అవసరమైన వారిని ఉన్నత ఆసుపత్రులకు రెఫర్ చేశారు. అలాగే ఆరోగ్య విద్య ద్వారా గర్భవతులకు లభించు వైద్య సేవలు. ఆర్థిక ప్రయోజనాలు, మరియు వాహన సేవల గురించి, ప్రభుత్వ ఆసుపత్రి ప్రసవాల ప్రాముఖ్యత గురించి అవగాహన కలిగించారు. ఈకార్యక్రమంలో కమ్యూనిటీ ఆరోగ్య అధికారిని విజయ, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ అధికారి మల్లయ్య, సమాజ ఆరోగ్య అధికారిని ప్రసన్న, స్టాఫ్ నర్స్ అనూష, ల్యాబ్ టెక్నీషియన్ కుమారి, ఫార్మసీ అధికారి మోహన్ మూర్తి, ఆరోగ్యకార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## మసీద్ దొంగతనం కేసులో ఇద్దరికి ఏడాది జైలు శిక్ష

తొండూరు, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :

తోండూరు పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన క్రైం నం. 152/2025 మల్లేలా మసీద్ దొంగతనం కేసులో ఇద్దరు నిందితులకు కోర్టు శిక్ష విధించింది. ఈ కేసులో నిందితులు షేక్ జిన్నాభిగారి హిదాయతుల్లా (A1), షేక్ గైబూసావలి (A2)లపై భారతీయ న్యాయ సంహిత, 2023 లోని సెక్షన్లు 331(3), 305 కింద కేసు నమోదు చేయగా, విచారణ అనంతరం ఆ సెక్షన్లలో కోర్టు వారిని దోషులుగా నిర్ణయించారు. అయితే, సెక్షన్ 317(2) BNS కింద నేరం రుజువైనట్లు తేలడంతో, పులివెందుల జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ చంద్ర శేఖర్ రెడ్డి తీర్పు ఇవ్వడం జరిగినది, ఇద్దరు నిందితులకు ఒక సంవత్సరం సాధారణ కారాగార శిక్షతో పాటు రూ.1,000 చొప్పున జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో ఒక నెల సాధారణ కారాగార శిక్ష అనుభవించాల్సి ఉంటుందని కోర్టు స్పష్టం చేసింది.ఈ కేసులో నిందితులు గతంలో అనుభవించిన నిర్బంధ కాలాన్ని శిక్ష కాలంలో మినహాయించాలని కూడా న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కేసుకు ఎపిపి జి మధుసూద నాచారి, పులివెందుల రూరల్ సిఐ ఎన్వి రమణ,తొండూరు ఎస్ఐ ఘన మద్దిలేటి సహకారం అందించారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మదనపల్లెక్రైమ్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త.

రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా, పలువురు గాయపడ్డారు. ఈ సంఘటన ఆదివారం రాత్రి మదనపల్లె మండలంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గుర్రంకొండ మండలం, మర్రిపాడు పంచాయతీ, మొరవపల్లి కు చెందిన గంగరాజు (50), భార్య నాగమణి, కుమార్తెలు దీప, దివ్య, సునీత, గంగరాజు చెల్లెలు జ్యోతి, ఆమె భర్త రమణ లతో కలిసి సయ్యద్ బాష ఆటోలో సిటియంలో వెలిసిన శ్రీ నల్లవీర గంగా భవాని ఆలయానికి వెళ్లారు. అమ్మవారి దర్శనం అనంతరం ఆటోలో తిరుగు ప్రయాణయ్యారు. మార్గ మధ్యంలోని కాశీరావుపేట వద్ద ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో గంగరాజు తీవ్రంగా గాయపడగా, ఆటో డ్రైవర్ తో పాటు మిగతా కుటుంబసభ్యులకు గాయాలయ్యాయి. బాధితులను 108లో మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గంగరాజు మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## క్వారీలో గల్లంతైన విద్యార్థి మృతి

మదనపల్లెక్రైమ్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త.

క్వారీ మధ్యలో ఏర్పడిన నీటిమడుగులో ఈత ఆడేందుకు వెళ్లిన విద్యార్థి గల్లంతై మృతి చెందిన సంఘటన సోమవారం మండలంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మదనపల్లె పట్టణం, అప్పారావు తోటకు చెందిన అప్సర్ బాష, ఆలీమాస్ దంపతుల కుమారుడు మహ్మద్ అనాస్ (14) స్థానిక క్రిస్టోఫర్ స్కూల్లో 8వ తరగతి చదువుతున్నాడు. ఆదివారం సెలవు కావడంతో స్నేహితులతో కలిసి సాయంత్రం పోతుబోలు పంచాయతీ, జబ్బల శ్రీనివాసులుకు చెందిన క్వారీ మధ్యలో ఏర్పడిన నీటి మడుగులోకి ఈతకు ఎళ్ళాడు. స్నేహితులతో కలిసి ఈత ఆడుతూ నీటిమడుగులో గల్లంతయ్యాడు. తోటి స్నేహితులు వెళ్లి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. తల్లిదండ్రులు పరుగున అక్కడికి చేరుకుని గాలించారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది శివన్న తన సిబ్బందితో గాలింపు చర్యలు చేపట్టారు. రాత్రి కావడంతో బాలున్ని గుర్తించడం సాధ్యపడలేదు. తిరిగి సోమవారం ఉదయం గల్లంతైన విద్యార్థి కోసం గాలించి మృతదేహాన్ని వెలికి తీశారు. కుమారుడి మృతదేహాన్ని చూసి తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. క్వారీలో నీటిమడుగు ఏర్పడి ప్రమాదకరంగా ఉన్నా, అధికారులు స్పందించకపోవడం విచారకరమని పలువురు ఆరోపిస్తున్నారు. తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## టెన్త్ టాలెంట్ టెస్ట్‌ను జయప్రదం చేయండి

ఎడ్యుకేషన్ ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :

అఖిల భారత విద్యార్థి బ్లాక్ (ఏ.ఐ.ఎస్.బి) ఆధ్వర్యంలో ఫిబ్రవరి 20, 21 తేదీలలో జరగనున్న టెన్త్ టాలెంట్ టెస్ట్ ను జయప్రదం చేయాలని ఏ.ఐ.ఎస్.బి రాష్ట్ర అధ్యక్షులు సగిలి రాజేంద్ర ప్రసాద్ పిలుపునిచ్చారు. ఫిబ్రవరి 20, 21 తేదీలలో జిల్లా వ్యాప్తంగా 10వ తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నామని వారు తెలిపారు. ఏ.ఐ.ఎస్.బి నిరంతరం విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం పోరాడుతూ విద్యార్థులు ఈ పరీక్షకు 30 రూపాయలు ఎంట్రీ ఫీజు ఉంటుందన్నారు. జిల్లాలో మంచి ప్రతిభ కనబరచిన టాప్ టెన్ విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు ఉంటాయని వారు తెలిపారు. కావున జిల్లాలోని విద్యార్థిని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు పిలుపునిచ్చారు. మరిన్ని వివరాలకు 9502208191 నెంబరు సంప్రదించాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏ.ఐ.ఎస్.బి నాయకులు అభిషేక్, అఖిల్‌లు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికులకు పెండింగ్ వేతనాలు ఇవ్వాలి

ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ

మదనపల్లె, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :

నిరసన తెలుపుతున్న దృశ్యం

మున్సిపల్ డైలీ వేజెస్ పారిశుద్ధ్య కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించాలని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ డిమాండ్ చేశారు. సోమవారం ఏఐటియుసి ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మదనపల్లె, పుంగనూరు మున్సిపాలిటిల్లో డైలీ వేజెస్ కింద పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు తక్షణమే వేతనాలు చెల్లించాలన్నారు. 2025 ఏప్రిల్ నుండి 2026 జనవరి నెలవరకు పెండింగ్ వేతనాలు చెల్లించాలన్నారు. పారిశుద్ధ్య కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించకపోవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. మున్సిపాలిటిలో రోజూ పట్టణ పరిశుభ్రత కోసం పనిచేస్తున్న కార్మికులకు నెలల తరబడి వేతనాలు ఇవ్వకపోవడం మానవహక్కుల ఉల్లంఘనే అన్నారు. ఉన్నతాధికారు స్పందించి పెండింగ్ వేతనాలు చెల్లించాలన్నారు. అనంతరం జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కన్వీనర్ ముభాకర్, పట్టణ కార్యదర్శి తిరుమల, ఇంద్రాణి, శ్రీదేవి, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

## మార్కెట్‌యార్డులో చిన్నక్రేట్లు ఏర్పాటు

జాయింట్ డైరెక్టర్ రామాంజనేయులు

మదనపల్లె, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :

మాట్లాడుతున్న జాయింట్ డైరెక్టర్ ఆంజినేయులు

రైతులకు లాభదాయకంగా సులభరంగా ఉండేందుకు మార్కెట్‌యార్డుల్లో మార్చి నెల నుంచి చిన్నక్రేట్లు ఏర్పాటు చేయనున్నట్లు మార్కెటింగ్‌శాఖ జాయింట్ డైరెక్టర్ రామాంజనేయులు తెలిపారు. సోమవారం మదనపల్లె మార్కెట్‌యార్డు ఛైర్మెన్ జంగాల శివరామ్ అధ్యక్షతన జాయింట్ డైరెక్టర్ మదనపల్లె, మొలకలచెరువు, అంగళ్ళు, వాల్మీకిపురం, గుర్రంకొండ మార్కెట్ యార్డుల సెక్రటరీలు, మండీ యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ డైరెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ సూచనల ప్రకారం రైతుల సంక్షేమం కోసం అన్ని విధాల చర్యలు చేపట్టామన్నారు. మార్కెట్‌యార్డుల్లో చిన్న క్రేట్లు ఏర్పాటుకు విరుద్ధంగా మండీల్లో వేలంపాటలు నిర్వహిస్తే మండీ యజమానులపై చర్యలు తీసుకొంటామన్నారు. అంతేకాకుండా టమోటా వ్యాపార లావాదేవీల్లో విక్రయాలు జరిపే రోజే రైతులకు నగదు చెల్లింపు చేయాలన్నారు. అనంతరం ఛైర్మెన్ జంగాల శివరామ్ మాట్లాడుతూ టమోటా రైతులను అన్ని విధాల ఆదుకునేందుకే మార్కెట్ కమిటి కృషి చేస్తుందన్నారు. లాభదాయకమైన చిన్నక్రేట్లు ఏర్పాటుకు అన్ని విధాల సహాయ సహకారం అందిస్తామన్నారు. ఈ సమావేశంలో వాల్మీకిపురం ఛైర్మెన్ చంద్రశేఖర్, ములకలచెరువు గోవిందనాయుడు, మదనపల్లె మార్కెట్ సెక్రటరీ జగదీష్, సునీల్, మండీ యజమానులు, మార్కెట్‌యార్డు డైరెక్టర్లు పాల్గొన్నారు.

## శివాలయం అభివృద్ధికి శాయక్తులా కృషి

ఛైర్మెన్ ప్రమాణ స్వీకారంలో ఎమ్మెల్యే

మదనపల్లె, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :

ఎమ్మెల్యే, ఛైర్మెన్‌లను సన్మానిస్తున్న దృశ్యం

పట్టణంలోని మడికయ్యల యోగబోగేశ్వర శివాలయం అభివృద్ధికి శాయశక్తులా కృషి చేయనున్నట్లు ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. సోమవారం శివాలయంలో నూతన ఛైర్మెన్‌గా నియామకమైన కొప్పల వెంకటరమణ, ఆలయ కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు విశ్వేశ్వరశర్మ, ఆలయ ఈఓ వెంకటరమణ సమక్షంలో పాలకవర్గం ప్రమాణస్వీకారోత్సవం నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని పేరు పొందిన మడికయ్యల శివాలయం అభివృద్ధికి అన్ని విధాల కృషి చేయడం జరుగుతుందన్నారు. భక్తుల సౌకర్యార్థంగా ఆలయం ముందు మండప నిర్మాణానికి కూడా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేష్, తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్‌చినబాబు, టౌన్‌బ్యాంకు ఛైర్మెన్ నాదేళ్ళ విద్యాసాగర్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పసుపులేటి వరప్రసాద్, శివకుమార్, నాగరమ్మ, భవాని, మల్లికారాణి, లక్ష్మినరసింహులు, ప్రకాష్‌నాయుడులు హాజరై ప్రమాణస్వీకారం చేశారు. కురవంక సర్పంచ్ చలపతి, బిజెపి నాయకులు చల్లపల్లె నరసింహారెడ్డి, విజయభారతిస్కూల్ సేతు, ఎల్లంపల్లి ప్రశాంత్, బర్నేపల్లి రవికుమార్‌లు హాజరయ్యారు.

## వక్ఫ్‌బోర్డు భూములను పరిరక్షించండి

వైకాపా మైనార్టీ నాయకులు విన్నపం

మదనపల్లె, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త :

జేసికి విన్నవిస్తున్న దృశ్యం

వక్ఫ్‌బోర్డు భూములను కాపాడాలంటూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన మైనార్టీ నాయకులు సోమవారం జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మకు విన్నవించారు. వక్ఫ్‌బోర్డుకు చెందిన భూములను ప్రభుత్వ భూములుగా మార్చేందుకు కూటమి ప్రభుత్వం కుట్ర పన్నుతోందని దీనిని అడ్డుకునేందుకు వైఎస్ఆర్ సిపి అధిష్టానం పిలుపు మేరకు కలెక్టరేట్‌లో నియోజకవర్గ సమన్వయకర్త నిస్సార్‌అహ్మద్ ఆధ్వర్యంలో జిల్లా జాయింట్ కలెక్టర్‌కు విన్నవించారు. ఈ సందర్భంగా మైనార్టీ నాయకులు, జిల్లా మైనార్టీ అధ్యక్షులు మహమ్మద్‌ఖాన్, ఉపాధ్యక్షులు రహంతుల్లా, గుండ్లూరు రఫి, మహమ్మద్ యూనిస్, మున్సిపల్ వైస్‌ఛైర్మెన్ నూర్‌అజాంలు మాట్లాడుతూ జిల్లాలోని ముస్లింలు అందరూ వక్ఫ్‌బోర్డు భూములపై ప్రభుత్వ విధానాన్ని వ్యతిరేకించాలని డిమాండ్ చేశారు. వక్ఫ్‌బోర్డు భూములు ప్రభుత్వ పరం కాకుండా పరిరక్షించుకుంటేనే ముస్లింలకు మనుగడ ఉంటుందన్నారు. ఈకార్యక్రమంలో మైనార్టీ నాయకులు ఖాజా, ఎస్‌కె.కరీముల్లా, నాసీర్, నవాజ్‌ఖాన్, జావిద్, షాన్‌వాజ్, నవాజ్‌ఖాన్, నూర్‌మెహిద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

## సమీక్ష సమావేశం

రాయచోటి ఫిబ్రవరి 9 ప్రభాతవార్త

శ్రీ భద్రకాళి సమేత శ్రీ వీరభద్ర స్వామి దేవస్థానమునకు సంబంధించిన ఈ నెల 13 /2/2026వ తేదీ నుండి 23 ఫిబ్రవరి 26వ తేదీ వరకు శ్రీ వీరభద్ర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీ వీరభద్రస్వామి దేవస్థానం నందు 10వ తేదీ ఫిబ్రవరి 2026వ తేదీన ఉదయం 10 గంటలకు వివిధ శాఖాధిపదులతో రాయచోటి మండల తహసిల్దార్ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. కావున వివిధ శాఖ అధిపతులు మరియు పెద్దలు తప్పక హాజరై సూచనలు సలహాలు ఇవ్వవలసినదిగా ఆలయ చైర్మన్ మనోజ్ కుమార్, పాలకమండలి సభ్యులు ఆలయ కార్యనిర్వహణాధికారి డి.వి రమణా రెడ్డిలు తెలియజేశారు. అదేవిధంగా శ్రీ వీరభద్ర స్వామి దేవస్థానం నందు ఎనిమిదో తేదీ ఫిబ్రవరి 2026న స్వామివారి సేవా టికెట్లు మొత్తం రూ.54786/- లు ఈనెల 9వ తేదీ 2026

## సమన్వయంతో బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తాం

టిడిపి అసెంబ్లీ ఇన్చార్జ్ జగన్మోహన్ రాజు



అత్తిరాల బ్రహ్మోత్సవాల వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న జగన్మోహన్ రాజు

రాజంపేట, ఫిబ్రవరి 8 ప్రభాతవార్త.

అత్తిరాలలో మహా శివరాత్రి హత్యరాల బ్రహ్మోత్సవాలను శాఖల అధికారులు కలిసి సమన్వయం చేసుకొని వైభవంగా నిర్వహిస్తామని టిడిపి అసెంబ్లీ ఇన్చార్జ్ జగన్మోహన్ రాజు అన్నారు. సోమవారం బ్రహ్మోత్సవాల వాల్పోస్టర్లను పాలకవర్గం, దేవదాయ శాఖ అధికారులతో కలిసి జగన్ మోహన్రాజు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కలిసికట్టుగా బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. ఈ మేరకు మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా విస్తృత ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.అన్ని శాఖల అధికారుల సమన్వయంతో పనిచేసి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని సూచించారు. దేవస్థానం ఆలయ ప్రాంగణంతో పాటు,పరిసర ప్రాంతాలలో పారిశుద్ధ్య పనులు, నిరంతర విద్యుత్ సరఫరా,ఆలయానికి విద్యుత్ దీపాల అలంకరణ,చలువ పందిర్లు తదితర అంశాలపై పలు సలహాలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు,ఆలయ చైర్మన్ పూల నరసింహులు, సుబ్రహ్మణ్యం నాయుడు,తెలుగుదేశం పార్టీముఖ్య నాయకులు, కార్యకర్తలు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం వద్దు

అదనపు ఎస్పీ వెంకటాద్రి

మదనపల్లెక్రైమ్, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త.

జిల్లా ప్రజల సమస్యలను పరిష్కరించడంలో అలసత్వం చూపకుండా బాధితులకు సత్వర న్యాయం అందించాలని జిల్లా అదనపు ఎస్పీ వెంకటాద్రి స్పష్టం చేశారు. సోమవారం స్థానిక డిఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు దారులతో ఎఎస్పీ మాట్లాడి, వారి సమస్యలను విని, అర్జీలపై విచారణ జరిపి, న్యాయం అందించాలని సంబంధిత అధికారులను ఫోన్‌లో ఆదేశించారు. తీసుకున్న చర్యల నివేదికను వెంటనే జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి పంపాలని సూచించారు. వికలాంగులు, వృద్ధులు, మహిళల ఫిర్యాదులకు మొదట ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. జిల్లా కేంద్రానికి రాలేకపోయిన ప్రజలు తమ ఫిర్యాదులను దగ్గరలోని పోలీస్ స్టేషన్లు, సర్కిల్ లేదా సబ్ డివిజన్ కార్యాలయాలలో కూడా ఇవ్వవచ్చని, వాటిని కూడా ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఫిర్యాదులుగానే పరిగణించి, సకాలంలో న్యాయం అందిస్తామని స్పష్టం చేశారు.

## గర్భిణీలకు బాలింతలకు పౌష్టికాహారం

బ్రహ్మంగారిమఠం ఫిబ్రవరి 09 ప్రభాతవార్త.

భూత భవిష్యత్ వర్తమాన కాలజ్ఞానాన్ని రచించిన శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం నుండి ప్రతి నెల 9వ తేదీన మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలకు వచ్చే గర్భవతులకు బాలింతలకు వైద్య పరీక్షలకు వచ్చే వారి ఆకలి కడుపుతో వెళ్లకూడదని మఠాధిపతి శ్రీ వీర దర్మజ వెంకటాద్రి స్వామి ఆదేశాల మేరకు భోజన సదుపాయం అందజేస్తున్నట్లు మేనేజర్ ఈశ్వరయ్య చారి తెలిపారు, గర్భిణీలకు బాలింతలకు పౌష్టికాహారం అందించిన అనంతరం ప్రభుత్వ వైద్యాధికారి సంపత్ కుమార్ మాట్లాడుతూ గర్భిణీలకు బాలింతలకు బ్రహ్మంగారి ఆలయం నుండి భోజన సదుపాయం ఏర్పాటు చేయడం మంచి సంతోష తగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం సిబ్బంది వేణు గోపాల్, శ్రీనివాసు లు, కిరణ్,ఏఎన్ఎంలు ఆశా వర్కర్లు వైద్య సిబ్బంది ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎలకమానమ్మ జాతర

పెద్దమండెం ఫిబ్రవరి 9 ప్రభాతవార్త

మండలంలోని శివపురంలో ఆదివారం ఎలక మానమ్మ గంగమ్మ జాతరను ఘనంగా నిర్వహించారు సర్పంచ్ గంగులమ్మ ఆధ్వర్యంలో పోరెడ్డిగారి పల్లి కనకంటి వారి పల్లి కురవపల్లి గొల్లపల్లి సంఘటన గ్రామస్తులు ఎలకమానమ్మ తల్లికి దీలు బోనాలు సమర్పించారు అనంతరం శాంతిని బండగట్టి ఊరేగింపు గావించి ప్రత్యేక పూజలు నిర్వహించారు సందర్భంగా గ్రామంలో ప్రజలు సంతోషంగా సుఖశాంతులతో పైరు పంటలతో చల్లగా ఉండాలని కలకాలం సంతోషంగా సుఖశాంతులు తో వర్ధిల్లాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## బడి మనదే బాధ్యత మనదే : యుటిఎఫ్

పీలేరు ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:

యుటిఎఫ్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించుదాం ఊరి బడులని కాపాడుదాం, బడి మనదే బాధ్యత మనదే అనే నినాదంతోచేపట్టిన కార్యక్రమాన్ని తల్లి తండ్రులు వద్దకు తీసుకుపోవాలని కె.వి.పల్లి మండల విద్యాశాఖ అధికారులు పి.రెడ్డి భాష,సుబ్రహ్మణ్యం రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉన్నారని అన్ని రకాల సౌకర్యాలు ఉన్నాయని ఈ విషయాన్ని తల్లి తండ్రులు గమనించి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. అలాగే బడి ఈడు పిల్లల అందరినీ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించే బాధ్యత ఉపాధ్యాయులు తీసుకోవాలన్నారు. ఇలాంటి మంచి కార్యక్రమం యుటిఎఫ్ సంఘం చేపట్టడం హర్షనీయమన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల గౌరవాధ్యక్షుడు రమణారెడ్డి,అధ్యక్షుడు వెంకటరమణ రెడ్డి ,ప్రధాన కార్యదర్శి ఉదయకిరణ్ ,పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రయ్య ఉపాధ్యాయులు ప్రభాకర్, నవీన్, వెంకటరమణ, మోవాన్ ,ప్రభాకర్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

బడి మనదే బాధ్యత మనదే అనే నినాదంతో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

## జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి పోలీసు బందోబస్తు

సీసీ కెమెరా , డ్రోన్ కెమెరా నిఘాలో గంగమ్మ జాతర

అసాంఘిక కార్యక్రమాలు నృత్యాలు చేస్తే కఠిన చర్యలు తప్పవు

సీఐ కృష్ణంరాజు నాయక్

లక్కిరెడ్డిపల్లి ఫిబ్రవరి 9 ప్రభాతవార్త.

ఈనెల 18 19 తేదీలలో జరగబోవు అనంతపురం గంగమ్మ జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు సీఐ కృష్ణంరాజు నాయక్ పేర్కొన్నారు సోమవారం స్థానిక గంగమ్మ ఆలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతరలో మద్యం జూదం వంటి నిర్వహిస్తే వారిపైన కఠిన చర్ల తీసుకుంటామన్నారు చాందిని బండ్లు ఏర్పాటు చేసేవారు ముందుగానే పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు. గడప రాయచోటి పులివెందుల డిపో నుంచి వచ్చే బస్సులు యనమల వాండ్లపల్లి అనంతపురం హరిజనవాడ వద్ద ఆర్టీసీ బస్టాండ్ లో ఏర్పాటు చేశామన్నారు జాతరలో చిరు వ్యాపారస్తులు రోడ్డుకు 10 అడుగులు దూరంలో నిర్వహించుకోవాలన్నారు. కేవలం ఆర్టీసీ బస్సులు రవీంద్ర నగర్ మర్రిచెట్టు నుంచి జాతరలోకి అనుమతి ఇస్తామన్నారు లకిరెడ్డిపల్లి తాసిల్దార్ కార్యాల నుంచి ఎలాంటి వాహనాలను జాతరలోకి అనుమతి లేదన్నారు చాందిని బండి ఏర్పాటు చేసేవారు డ్రైవర్ బండికి లైసెన్సులు ఇన్సూరెన్స్ కలిగి ఉండాలన్నారు మద్యం సేవించి చాందిని బండి నడిపితే కటించనులు తప్పమన్నారు చాందిని బండి ముందు డీజే మైకు సౌండ్ లు ఏర్పాటు చేయకూడదన్నారు బండి చాందిని బండి ముందు అశ్లీలత నృత్య ప్రదర్శనలు నిర్వహించరాదన్నారు జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నాలుగు ప్రాంతాలలో పార్కింగ్లు ఏర్పాటు చేశామన్నారు అంతేకాకుండా జాతరలో పేలుడు పదార్థాలు నిషేధిస్తున్నామన్నారు జాతర ప్రాంగణమంతా రెండు డోన్ కెమెరాలు 20 సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు అమ్మవారి దర్శనం కోసం ప్రత్యేకంగా మూడు క్యూ లైన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు దాదాపు పోలీసులు 500 మంది పైగా జాతరకు చేరుకుంటారని ఆయన తెలిపారు వీఐపీలు దర్శనం ఉచిత పాసులు దేవాదాయ ధర్మాదాయ శాఖ రద్దు చేశారన్నారు భక్తులకు ఇబ్బందులు కలిగిన వెంటనే పోలీసులకు ఫోన్ చేయాలన్నారు డీఎస్పీ 9121100545 సిఐ 9121100554 ఎస్ఐ 9121100555 నెంబర్లకు ఫోన్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ వెంకటేశ్వర్లు ఆలయ ఈవో శ్రీనివాసులు సిబ్బంది పాల్గొన్నారు

## టైక్వాండో పోటీలలో విద్యార్థులు

సిద్ధవటం ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:

ఈనెల 8వ తేదీ తూర్పుగోదావరి జిల్లా పిఠాపురంలో టైక్వాండో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించారు ఈ పోటీలలో కడప జిల్లా సిద్ధవటం శ్రీ భారతి హై స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు సబ్ జూనియర్ కేటగిరీలో2025కేజీల విభాగంలో కే. ఈశ్వర్ రెడ్డి మరియు 2530 కేజీల విభాగంలో కె. సుశాంత్ బంగారు పతకం సాధించారు, ఈ పోటీలకు ముఖ్యఅతిథిగా పీఠాపురం మాజీ శాసన సభ్యులు వర్మ విచ్చేసి క్రీడాకారులకు బహుమతులు అందజేశారువ విద్యార్థుల విజయం పట్ల ప్రధానోపాధ్యాయురాలు ముక్కర నిర్మలాదేవి టైక్వాండో శిక్షకులు తిరుపతి ఆంజనేయులు హర్షం వ్యక్తంచేశారుఈవిద్యార్థులవిజయం మరెందరికో ఆదర్శంగా నిలుస్తుందని రాబోయే జాతీయస్థాయి క్రీడలలో కూడా పాల్గొని మంచి పతకాలు సాధించి కోచ్ ఆంజనేయులుకు శ్రీ భారతి హై స్కూల్ కు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని శ్రీ భారతీ హై స్కూల్ ప్రధాన ఉపాధ్యాయురాలు ముక్కర నిర్మలాదేవి కోరారు.

## ప్రారంభం కానున్న మహాశివరాత్రి వేడుకలు

బద్వేల్ అర్బన్ ఫిబ్రవరి 09 ప్రభాతవార్త :

బద్వేలు మండలం బోయనపల్లె గ్రామంలో గల కోనేటయ్య స్వామి ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా భక్తిశ్రద్ధలతో మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సోమవారం వెల్లడించింది. ఫిబ్రవరి 15 ఆదివారం నుండి 16 సోమవారం వరకు రెండు రోజుల పాటు జరుగనున్నాయి. కోనేటి అయ్యా కోనేటయ్య స్వామి గురించి వివరిస్తూ బోయనపల్లె గ్రామంలో దాదాపు 198 సంవత్సరాల క్రితం జన్మించి, చివరి వరకు జన్మస్థలాన్నే పునీతం చేస్తూ సజీవ సమాధి పొందిన మహా పురుషుడు శ్రీ కోనేటయ్య స్వాముల వారు అని, అప్పటి నుంచీ ఇప్పటి వరకు భక్తుల కోర్కెలు తీర్చే ముక్తి ప్రదాతగా ప్రసిద్ధి గాంచారని భక్తులు విశ్వసిస్తున్నారు. కడప జిల్లా భక్తి, ఆధ్యాత్మిక సంప్రదాయాలకు నిలయంగా పేరొందినదని ఆలయ పెద్దలు గుర్తుచేశారు. శ్రీ వేంకటేశ్వర స్వాముల వారికి తొలి గడపగా పేరుగాంచిన కడప జిల్లాలోనే, శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారు అవతరించి కాలజ్ఞానాన్ని రచించి బోధించిన కందిమల్లాయపల్లె, 32 వేల భక్తి గీతాలు రచించిన తాళ్ళపాక అన్నమాచార్యులు, మొల్ల రామాయణం రచించిన మహాకవయిత్రి మొల్ల వంటి మహనీయులు జన్మించిన ప్రాంతమన్నారు. అలాగే "బ్రహ్మంగారి అంతటి గురువు, సిద్ధయ్య గారి అంతటి శిష్యుడు లేడు" అని ఖ్యాతి పొందిన శ్రీ సిద్ధయ్య స్వాముల వారితో పాటు, అదే ఆధ్యాత్మిక కోవకు చెందిన శ్రీ కోనేటయ్య స్వాముల వారు భక్తుల ఆరాధ్య దైవంగా నిలిచారని ఆలయ నిర్వహకులు తెలిపారు. ఈ సందర్భంగా మహాశివరాత్రి ఉత్సవాలకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారి దర్శనం, తీర్థ ప్రసాదాలు స్వీకరించి, కోరిన కోరికలు నెరవేర్చుకోవాలని నిర్వాహకులు కోరారు.

## ఆర్థిక అక్షరాస్యత ఎంతో కీలకం

జిల్లా సంయుక్త కలెక్టర్ శివనారాయణశర్మ

పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

మదనపల్లె, ఫిబ్రవరి 9ప్రభాతవార్త :

ప్రజలు సరైన ఆర్థిక నిర్ణయాలు తీసుకోవడంలో ఆర్థిక అక్షరాస్యత ఎంతో కీలకమని జిల్లా సంయుక్త కలెక్టర్ శివనారాయణ శర్మ తెలిపారు. సోమవారం భారతీయ రిజర్వుబ్యాంకు(ఆర్‌బిఐ) వారు నిర్వహిస్తున్న ఆర్థిక ఆక్షరాస్యత వారోత్సవం సందర్భంగా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా సంయుక్త కలెక్టర్ మాట్లాడుతూ సోమవారం నుంచి 13శుక్రవారం వరకు ప్రజల్లో ఆర్థిక అవగాహన పెంపొందించేందుకు ఈ వారోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. ప్రజలు సరైన ఆర్థిక నిర్ణయాలు తీసుకోవడంలో ఆర్థిక అక్షరాస్యత ఎంతో దోహదపడుతుందన్నారు. సురక్షిత భ్యాంకింగ్ విధానాలు, డిజిటల్ లావాదేవీలు, పొదుపు అలవాట్లు, ఆర్థిక మోసాల గురించి రక్షణపై అవగాహన కలిగి ఉండాలన్నారు. లీడ్ జిల్లా మేనేజర్ ఆంజినేయులు మాట్లాడుతూ ఆర్థిక అక్షరాస్యత వారోత్సవం సందర్భంగా బ్యాంకింగ్ సేవలు, భీమా, పెన్షన్ పథకాలు, డిజిటల్ ఆర్థిక భద్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ మదుసూదన్‌రావు, సబ్‌కలెక్టర్ చల్లా కళ్యాణి, జిఎస్‌డబ్ల్యుఎస్ అధికారి లక్ష్మీపతి పాల్గొన్నారు.

## గుర్రప్ప స్వామి తిరుణాలలో బండలాగుడు పోటీలు

నందలూరు, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:

మండలంలోని నీలిపల్లె గ్రామంలో గుర్రప్ప స్వామి తిరుణాల సందర్భంగా సోమవారం దాసరి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను మాజీ ఆర్టీసీ రీజనల్ చైర్మన్ ఎద్దుల సుబ్బరాయుడు ప్రారంభించారు. మొత్తం ఆరు జతల ఎద్దులు పోటీల్లో పాల్గొనగా, మొదటి బహుమతి రూ.50 వేల నగదును ఓబులంపల్లి గ్రామానికి చెందిన సానపురెడ్డి సతీష్ కుమార్ రెడ్డి వృషభాలు గెలుచుకున్నాయి. రెండవ బహుమతి రూ.40 వేలను బాలయ్యగారి పల్లె గ్రామానికి చెందిన లింగారెడ్డి శ్రీకాంత్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి వృషభాలు సాధించాయి. మూడవ బహుమతి రూ.30 వేలను రంగూరిపల్లె గ్రామానికి చెందిన భక్తిల మహేందర్ వృషభాలు దక్కించుకున్నాయి. నాలుగవ బహుమతి రూ.20 వేలను సరస్వతి పేటకు చెందిన రామ్ చరణ్, బొగ్గుల లక్ష్మీదేవి వృషభాలు, ఐదవ బహుమతి రూ.10 వేలను గిద్దలూరు గ్రామానికి చెందిన సిరిగి రెడ్డి రామ్మోహన్ వృషభాలు, ఆరవ బహుమతి రూ.5 వేలను సిరిసిల్ల మండలం ఆర్ఎస్ కొండాపురానికి చెందిన యాపామాండ్ల శ్రీ ప్రణయ వృషభాలు గెలుచుకున్నాయి. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు జంగం శెట్టి సుబ్బయ్య, టీడీపీ నాయకులు పల్లె సుబ్రహ్మణ్యం, మోడపోతుల రాము, నీటి సంఘం అధ్యక్షులు భూశెట్టి వెంకటసుబ్బయ్యతో పాటు నిర్వాహకులు, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## లింగ నిర్ధారణ నిషేధ చట్టంపై అవగాహన : డాక్టర్ జులేఖ

పీలేరు ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:

ఆడశిశువును కాపాడుదాం సృష్టిని రక్షిద్దాం అని చింతపర్తి పీహెచ్‌సి వైద్యులు జులేఖ బేగం, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ అన్నారు. ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పీహెచ్‌సిలో హాజరైన గర్భవతులకు గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మాట్లాడుచు ప్రస్తుతం పిల్లల (06) లింగ నిష్పత్తి మన జిల్లాలో 916 ఉందని అనగా 1000మంది బాలురకు 916 మంది బాలికలు ఉన్నారని అన్నారు. లింగ వివక్షత వల్లనే ఇలా జరుగుతుంది అన్నారు. పుట్టబోయే బిడ్డ ఆడ లేక మగ అని తెలుసు కోవడం చట్ట రీత్యా నేరం అని ఈ చట్టాన్ని ఉల్లంగించిన వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. పరీక్షల ఉద్దేశ్యం అసాదారణ జన్యుస్థితిని గుర్తించడం, జన్యుజానీతమైన జీవకనాలలో జరిగే అసాదారణ మార్పు గుర్తించడం, రక్తం లోని ఎర్ర రక్త కనాలలో గల అసాదారణ స్థితిని గుర్తించడం, లింగ సంబందించిన వ్యాధులను గుర్తించుటకు చేస్తారు. గర్భిణీకి పరీక్షలు నిర్వహించే పరిస్థితులు గర్భిణీకి వయసు 35సంవత్సరాలకు పైబడి ఉండాలి, ఆమెకు గతం లో రెండు సార్లు కానీ లేక అంతకన్నా ఎక్కువ సార్లు పిండ నష్టం జరిగి ఉండాలి,ఆమె హానికరమైన మందులు, అనుధార్మిక శక్తి, రసాయణాలకు లోనై ఉండాలి, కుటుంబ చరిత్ర లో ఎవరికైనా మానసిక మాంధ్యము, శారీరక వైకల్యము, జన్యు సంబందించిన వ్యాధులు ఉన్నపుడు చేయాలి. అందుకే వైద్యులు సూచన మేరకు స్కానింగ్‌లు చేసుకోవాలి. సొంతంగా గర్భస్థ లింగం తెలుసుకోవాలని స్కానింగ్‌కు వెళ్ళరాదు. ఇలా చట్టాన్ని అతిక్రమించిన వారిపై వైద్యులు లేక గర్భిణీ, వారి బంధువులు, స్కానింగ్ కు సహకరించిన వారికి చట్టరీత్యా శిక్షకు గురిఅగుతారన్నారు. ఈ కార్యక్రమంలో సి.హెచ్.ఓ. అరుణ, పర్యవేక్షకులు భానుబి, బహుద్దీన్, ఎమ్. ఎల్.హెచ్. పీలు, ఏ.ఎన్.ఎమ్‌లు, ఆశాకార్యకర్తలు, గర్భిణీలు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయిలో మిట్స్ విద్యార్థుల ప్రతిభ

కురబలకోట ఫిబ్రవరి 9 ప్రభాతవార్త.

జాతీయస్థాయి టెక్నికల్ సింపోజియంలో మీట్స్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. కురబలకోట మండలం అంగళ్లు గ్రామ సమీపంలోని మిట్స్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ కి చెందిన ఇంటర్ డిసిప్లినరీ విద్యార్థుల బృందం జాతీయ స్థాయి టెక్నికల్ సింపోజియం లో ప్రతిభ కనబరిచి మొదటి బహుమతి సాధించినట్లు యూనివర్సిటీ ఉపకులపతి డాక్టర్ సి. యువరాజ్ అన్నారు. కడపలోని అన్నమాచార్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సైన్స్ కళాశాల నిర్వహించిన జాతీయ స్థాయి సాంకేతిక సింపోజియం లో "సస్టైనబుల్ సెరికల్చర్ దిగుబడి కోసం ఆధారిత పర్యావరణ పర్యవేక్షణ" అనే అంశంపై ప్రదర్శించిన పరిశోధన పత్ర సమర్పణలో ఈ బహుమతి పొందినట్లు ఆయన అన్నారు. షేక్ మొహమ్మద్ తహీర్ మెకానికల్ ఇంజనీరింగ్, 3వ సంవత్సరం, షేక్ చంద్ తౌసిఫ్ మెకానికల్ ఇంజనీరింగ్, 2వ సంవత్సరం, ఎస్. అష్రఫ్ మెకానికల్ ఇంజనీరింగ్, 2వ సంవత్సరం, ఎస్. ఎండి జైద్ మెకానికల్ ఇంజనీరింగ్, 2వ సంవత్సరం, జి. హేమంత్ నాయుడు మెకానికల్ ఇంజనీరింగ్, 2వ సంవత్సరం, షేక్ ఇమ్రాన్ కంప్యూటర్ సైన్స్ !! ఇంజనీరింగ్ (దిళీది), 4వ సంవత్సరం విద్యార్థులు మెకానికల్ విభాగము లో రిజ్వాన్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పర్యవేక్షణలో ఈ పరిశోధన పత్రము వివరించినట్లు ఆయన అన్నారు. గెలుపొందిన విద్యార్థులను మిట్స్ యూనివర్సిటీ వ్యవస్థాపకుడు మరియు ఛాన్సలర్ డాక్టర్ ఎన్. విజయ భాస్కర్ చౌదరి, ప్రో ఛాన్సలర్ ద్వారకానాథ్, యూనివర్సిటీ ఉపకులపతి డాక్టర్ సి. యువరాజ్, అధ్యాపకులు మరియు విద్యార్థులు అభినందనలు తెలియజేసారు.

## ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన

కలసపాడు, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త:

కలసపాడు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణీల ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ కలసపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీ.హెచ్. సి)లో నిర్వహించే నెలవారీ వైద్య పరీక్షల కార్యక్రమం సందర్భంగా ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శనను సోమవారం నిర్వహించారు. ఎ.పి.సి.యన్ యఫ్. మార్కెటింగ్ విభాగం ఆధ్వర్యంలో మండల డి.యం.యం.టి. రాజశేఖర్ రెడ్డి, మాస్టర్ ట్రైనర్ శ్రీలక్ష్మి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సమన్వయంతో ఈ అవగాహన కార్యక్రమం చేపట్టారు.పీ.హెచ్.సి వైద్యాధికారి సమక్షంలో జరిగిన ఈ ప్రదర్శనలో శ్రీ లక్ష్మీ మాట్లాడుతూ రసాయన ఎరువులు, పురుగుమందులతో పండించిన ఆహార పదార్థాలు ఆరోగ్యంపై కలిగించే ప్రభావాన్ని వివరించడంతో పాటు, ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన ధాన్యాలు, కూరగాయలు, పండ్ల ఉపయోగాలను గర్భిణీలకు తెలియజేశారు. మండల వైద్య అధికారి సాయి తేజ మాట్లాడుతూ గర్భధారణ సమయంలో తీసుకునే పోషకాహారం తల్లి ఆరోగ్యానికే కాకుండా గర్భంలో పెరుగుతున్న శిశువు ఎదుగుదలకు ఎంతో కీలకమని సహజ పద్ధతుల్లో పండిన ఆహారం తీసుకోవడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుందని, భవిష్యత్తులో ఆరోగ్యవంతమైన తరాలను నిర్మించేందుకు ఇది దోహదపడుతుందని అవగాహన కల్పించారు. రసాయన అవశేషాలు లేని ఆహార పదార్థాలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. గర్భిణీలు కూడా ప్రదర్శనలో ఉంచిన ఉత్పత్తులపై ఆసక్తి చూపుతూ వివిధ ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, గర్భిణీలు, పీ.హెచ్.సి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఎమ్మార్వోకు వీఆర్ఏల సమ్మె నోటీసు

రాజంపేట, ఫిబ్రవరి 9 ప్రభాతవార్త

దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా మండలంలోని విఆర్వోలు సోమవారం తాసిల్దార్ పీర్ మున్నికి సమ్మె నోటీసు అందజేశారు. రాజంపేట ఎంఆర్ఓ ఆఫీస్ దగ్గర వీఆర్ఏ సంఘం ఆధ్వర్యంలో సిఐటి అనుబంధ సంఘం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేసి ఎమ్మార్వో కు ఈనెల 12వ తేదీన దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలు పిలుపుమేరకు ఈ సమ్మెలో పాల్గొంటున్నామని , అందువల్ల ఆరోజు విధులకు హాజరు కాలేమని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు చిట్వేల్ రవికుమార్, సిఐటియు పట్టణ కన్వీనర్ పివి రమణ, వీఆర్ఏ సంఘం నాయకులు రమణయ్య, భాష ,వెంకటేశు, ఎంవి రమణ, ప్రసాద్ పాల్గొన్నారు.

## జీవసమతుల్యాన్ని కాపాడటంలో సీతాకోకచిలకల పాత్ర ఎనలేనిది



కడప, ఫిబ్రవరి 9, ప్రభాతవార్త:

ప్రభుత్వ పురుషుల కళాశాలలో జంతు శాస్త్ర శాఖ వారి ఆధ్వర్యంలో డిబిటీ స్టార్ కాలేజ్‌లో భాగంగా ప్రత్యేక ఉపన్యాసాన్ని ప్రముఖ సీతాకోకచిలుకల శాస్త్రవేత్త అయినటువంటి ఎస్ పివి రమణతో ఏర్పాటు చేశారు. కార్యక్రమ ప్రారంభంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం రమేష్ మాట్లాడుతూ విశ్వంలోనే ప్రత్యేకత కలిగినటువంటి సీతాకోకచిలుకల పైన ఇటువంటి ప్రోగ్రాం ని నిర్వహించినందుకు అభినందనలు తెలియజేశారు. ముఖ్య వక్తగా విచ్చేసినటువంటి ఎస్పీవీ రమణ మాట్లాడుతూ ప్రకృతిలో ప్రతి జీవికి ఎంతో ప్రాముఖ్యత ఉంటుందని తెలియజేస్తూ ప్రాముఖ్యంగా సీతాకోకచిలుకలు ఏ విధంగా తోడ్పడతాయని అంశంను కూలంకుశంగా వివరించారు. విశ్వంలో ఉన్నటువంటి వివిధ రకాల సీతాకోకచిలుకల జాతులను అలాగే మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉన్నటువంటి జాతులను వాటి ప్రాముఖ్యతను ముఖ్యంగా మనుషులకు ఆహ్లాదం కలిగించే జాతులలో సీతాకోకచిలుకలు ముఖ్య స్థానాన్ని ఏర్పరచుకున్నాయని తెలియజేశారు. సీతాకోకచిలుకలలోని వివిధ రకాల జాతులను వాటిని గుర్తించే విధానాలను వాటి జీవిత విశేషాలు సమతుల్యాన్ని కాపాడటంలో సీతాకోకచిలుకల ప్రాధాన్యతను వివరించారు. ఎంతో వైవిధ్యమైన రీతిలో వీటి జీవితం సాగుతుందని ప్రకృతి వైపరీత్యాలను గుర్తించడంలో అనేక జీవజాతులకు ఆహారంగా ఉపయోగపడే విషయంలో ఆహారపు గొలుసులో వీటి యొక్క ప్రాముఖ్యతను గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిబిటి కోఆర్డినేటర్ డాక్టర్ వై సావిత్రి జంతు శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ పి.రవిశేకర్ ఐక్యూ ఏసి కోఆర్డినేటర్ డాక్టర్ సురేష